(సంపుటి - III)



# హరి సేవకే వేంకటేశ మకుటం

ఇది

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య

సంకీర్తనలకు అమరవాది భావపరిమళం





శ్రీరస్తు

శుభమస్తు　　　　　　　　　　అవిఘ్నమస్తు





# హరి సేవకే వేంకటేశ మకుటం

## అన్నమయ్య, పెద తిరుమలయ్య, చిన తిరుమలయ్య సంకీర్తనలకు

# భావ పరిమళం


రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# హరి సేవకే వేంకటేశ మకుటం

(సంపుటి - III)

మొదటి ప్రచురణ

**జూన్ 2014**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

**కె.వి.ఆర్.**

98495 79345





## అంకితము

**మా తండ్రి, తాత, ముత్తాతలు, భార్యాసమేతులుగా**

**శ్రీపతి పాదపద్మాలు పొందెదరు గాక**



సీ॥ ప్రపితామహుడు నాకు పరగె మృత్యుంజయ
సోమయాజులుగారు చొక్కెముక్తి
దివికి సుబ్రహ్మణ్య దీక్షితులుంగారు
మా తాత వడిజేరె మహిని వీడి
చదివించు గతిలేక సంతబేహారియై
రామకృష్ణుడు తండ్రి లక్షలెన్నె
ఎంటెక్కు చదివియు ఇంకొక వ్యాపారి-
గామారి గడియించి కంటికీర్తి

ఆ.వె॥ రోగమొచ్చి బ్రతుకు రోతయై కుందితిన్
వేంకటేశుడేలె పెన్నిధాయె
కవితవ్రాయ నేర్పె ఘనమైన యీకృతి
అంకితమ్ము పెద్దలందరికిని.

# హరి సేవకే వేంకటేశ మకుటం

## (సంపుటి - III)

## అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య సంకీర్తనలకు భావ పరిమళం

## విషయ సూచిక


| క్ర.సం. | కీర్తన వివరము | సంపుటము/సంఖ్య | పేజి |
|---|---|---|---|
| 1. | అందుకేమి దోసమా అయితే | 10/119 చి.శృ | 22 |
| 2. | అటుగాన శరణంటి | 15/435 పె.అ. | 1 |
| 3. | అటువంటి వారికి నీవప్పుడే | 10/143 చి.శృ | 34 |
| 4. | అట్టెనిన్ను జూచి జూచి | 29/167 | 50 |
| 5. | అట్టివాడగనకనే హరి నీదాసుడ | 15/9 పె.అ. | 6 |
| 6. | అది యెవ్వతె తాను అలమేల్మంగ | 29/43 | 40 |
| 7. | ఆతడేమి సేసినాను | 29/137 | 44 |
| 8. | ఇంకనేల నాతోడ యింతసేయ | 10/100 చి.శృ | 24 |
| 9. | ఇంకానేమిగావెనే యిన్నిటా | 29/42 | 39 |
| 10. | ఇందాకారతి కేలికి | 29/161 | 48 |
| 11. | ఇదిగో యలమేల్మంగ యింతబత్తి | 29/166 | 51 |
| 12. | ఇన్ని గురుతులు నీతోనేకె | 29/170 | 45 |
| 13. | ఇన్నాళ్ళు నెఱగము నిటువంటి | 29/164 | 52 |
| 14. | ఇచ్చుకమే సేసేవేరా నీవు | 10/99 చి.శృ | 29 |
| 15. | ఇన్నాళ్ళూ నందు నిందుయేమి | 15/114 పె.అ. | 2 |
| 16. | ఇన్నాళ్ళూ దాయేడనుండె | 10/109 చి.శృ | 31 |
| 17. | ఎంచబోతే మావల్లనేకేమున్నది | 15/176 పె.అ. | 10 |
| 18. | ఎక్కడ దాగగవచ్చునింక | 15/389 పె.అ. | 16 |
| 19. | ఎత్తూనొర గలదటువంటి | 10/95 చి.శృ | 20 |
| 20. | ఎన్నటి చుట్టరికమో | 29/168 | 49 |
| 21. | ఎఱగమిన్నాళ్ళమీయిద్దరి సరితెలు | 29/41 | 42 |
| 22. | ఏమనివున్నదో యీమనసు | 15/80 చి.శృ | 4 |
| 23. | ఏల లోకులకు జూపేవింద్రాదుల | 15/342 పె.అ. | 15 |
| 24. | ఒగ్గాలివాడు గదే వోయమ్మా | 10/115 చి.శృ | 25 |
| 25. | ఔనయ్యా మేలెరిగిన ఆణకాడవు | 10/98 చి.శృ | 30 |
| 26. | కంభములో వెడలితివి కరిరాజు | 15/358 పె.అ. | 7 |
| 27. | కన్నెపడుచుతోనేమి గయ్యాళించే | 10/93 చి.శృ | 21 |
| 28. | చదివేవి వేదములాచారము | 15/13 పె.అ. | 9 |
| 29. | చల్లనిచూపులవాని | 10/110 చి.శృ | 26 |
| 30. | చిన్నదాన నంటానీ | 29/180 | 46 |
| 31. | చెప్పకురే వాని సుద్ది చెలులాల | 10ఉ118 చి.శృ | 23 |
| 32. | చెప్పబోతే బసలేదు శ్రీపతి దాసులు | 15/57 పె.అ. | 5 |
| 33. | చెలియన్నిటికి నీకు | 29/160 | 47 |
| 34. | చెలియా నీవిన్నపాలు చిత్తాన | 29/178 | 41 |
| 35. | చెల్లుబడి కల్లలట చేతులివి | 15/188 పె.అ. | 8 |
| 36. | జాజరవలపుజాణడే | 10/113 చి.శృ | 28 |
| 37. | తప్పక చూడవయ్య తలయెత్తి | 29/41 | 38 |
| 38. | తలపుదలపు లెస్స | 10/102 చి.శృ | 35 |
| 39. | తారుకాణ వచ్చెనా | 29/177 | 43 |
| 40. | నన్నెంత లాలించేవు | 29/138 | 37 |
| 41. | నిన్నుబాయగలడటే నిమిషమైన | 29/179 | 36 |
| 42. | నీవెంతనేమెంత నీకృపయెంచుట | 15/448 పె.అ. | 17 |
| 43. | నీదాకావలె నా నిఖిలము | 15/164 పె.అ. | 14 |
| 44. | పురుషోత్తమా అన్నిటిలో | 15/385 పె.అ. | 3 |
| 45. | బాలుడటనే సాదటవేవీడు | 10/111 చి.శృ | 27 |
| 46. | మందులమాయలబోదె | 10/104 చి.శృ | 32 |
| 47. | మరిదియనుచు ధర్మజుడు | 15/18 పె.అ. | 13 |
| 48. | మతియుమతియు బలుమారు | 15/354 పె.అ. | 19 |
| 49. | మానరాదు నీకింక మమ్ముగావవలె | 15/416 పె.అ. | 11 |
| 50. | వాదము లేటికి వలసిన వారికి | 15/157 పె.అ. | 12 |
| 51. | వేళావేళలు లేవా వినోదముల | 10/141 చి.శృ | 33 |
| 52. | వోహో రాకాసుల వొద్దు సుండీ | 15/140 పె.అ. | 18 |




హరి సేవకే వేంకటేశమకుటం

# ప్రార్థన

కం॥ శ్రీకాంతుని కీర్తించుట-
కే కద! యీ జీవనంబు క్రీడించుటకా?
మాకేల కీర్తి, సిరులును
మాకీ హరిసేవ చాలు మన్నన యిదియే.

ఉ॥ చేకొని వేంకటేశ్వరుని సేవగకైతలు చెప్పినారహో!!
ఆకడతాళ్ళపాక కవులైన మహాత్ములు అన్నమయ్యకున్
సోకగు పుత్రపౌత్రులతిసొంపుగ ఆమకుటంబుతోడనే
శ్రీకరువేంకటేశ్వరుని సేవతరించిరి మాకు భాగ్యమై.

ఆ.వె॥ భావపరిమళంబు పరిఢవిల్లుచునుండ
తాళ్ళపాక కవులు తలలువూప
నేటివారి కొరకు నీటుగ జెప్పెద
చదివి దీనిమెచ్చ సంతసింతు.

తే.గీ॥ మొదట శృంగార కవితలు ముగ్గురున్ను
చెప్పినవి ఎన్నుకొంటిని చెలువమొప్ప
ఆర్తితీరక అధ్యాత్మ కీర్తనముల
జెప్పితరియింతు వేంకటశిఖరవాస!

చం॥ సరసుడు వీడు శ్రీవిభుడు జన్మల భాగ్యప్రదాత తానెయౌ
తిరుమల చేరియొక్కపరిదీవెనలందుము మంచిదారిరా
పరిమితమైన జీవితము బాధ్యత తీరదు చావుదాక,నా
తెరవును మీరు చేకొనుడుదేనికి శంకలు నమ్ముడీహరిన్.





సీ॥ హరిసేవకే వేంకటాధిపు మకుటమ్ము
చేబూనికైతలు చెప్పినారు
అన్నమయ్య, అతనికాప్తుడౌ మనుమండు,
సుతుడు అదేబాట జొచ్చినారు
తాళ్ళపాక కవులు తరియించుటే కాదు,
మనబోంట్లకును ముక్తి మార్గమడిరి
కొడుకులన్నను తండ్రి కోర్కె దీర్చెడివారె
కొరివిబెట్టుటకేమి కొయ్యచాలు

ఆ.వె॥ అచ్చతెనుగు కవిత అవగతమగుటకు
నేటితరమువారి నేర్పు మితము
భావపరిమళంబు భక్తితో జెప్పితిన్
దిక్కునాకు నీవె తిరుమలేశ!

తరళము :

తరతరాలుగ శ్రీనివాసుని తాతతండ్రులు మన్మడున్
కొలుచుటే అపురూపమందురు కార్యదీక్షగ కైతలన్
విలువతగ్గక కీర్తనంబులు వేంకటామకుటంబుతో
చెలువమెప్పగ చెప్పిరందుకె చేరి బొందిరి మోక్షమున్.

కం॥ హరిసేవకె యీ దేహము
హరిజేరని జన్మయేల అది వ్యర్థమురా
హరిజెప్పని చదువెందుకు?
హరిగొల్వని చేతులేల హత్యలకొరకా?

మ॥ ఇదియే చక్కటి బాటరా కొలువనై ఈశున్ జగన్మోహనున్
పదిలంబైనది పెద్దలెందరొ ఇదే బాటంది వైకుంఠమున్
ముదమొప్పన్ గడియించిరయ్య వినుడీ ముద్దార నాకున్ హరే
అదిగో ఈ మకుటంబెరక్షయనుచున్ అందింతు మీకీ కృతిన్.

# తొలిపలుకు

శ్రీవేంకటేశ్వర అనే మకుటంతో 32000 కీర్తనలు చెప్పిన ఘనుడు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. రమారమి 75 సంవత్సరాలు ఆ యజ్ఞం నిర్వహించారాయన. ఆయన కీర్తన వినని శ్రీహరిభక్తుడు వుండడు. మన దురదృష్టంకొద్దీ 20 వేల కీర్తనలు లభ్యంకాలేదు.

ఆయన తదనంతరం వారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు తండ్రిమాట ప్రకారం అదే మకుటంతో తానూ అనేక కీర్తనలు చెప్పారు. అంతేకాదు తాతగారివద్దనే పెరిగి ఆయన వారసత్వంగా సాహిత్య పరిమళం అందుకొన్న ఒక సుపుత్రుని కన్నాడు. ఆయనే చినతిరుమలాచార్యులవారు. ఆయనా తాతగారివలె కీర్తనలు చెప్పి తిరుమలేశుని సేవించారు. కొడుకుల కవితా శైలి పరంపరగా సాగింది. ఇదివరలో అన్నమయ్య – అనుయాయులు అనే పేరుతో అన్నమయ్య భక్తి కీర్తనలు, పెదతిరుమలయ్యవి శృంగార కీర్తనలు, చినతిరుమలయ్యవి వైరాగ్య కీర్తనలను పరిచయం చేసే భాగ్యం ఆ తిరుమలేశుడు నాకు కల్పించాడు. దానిని టి.టి.డి. వారు ముద్రిస్తున్నారంటే, నా జన్మ చరితార్థమైనదని భావిస్తున్నాను.

నేడు అదే స్ఫూర్తితో వారి ముగ్గురి శృంగార కీర్తనలకు భావపరిమళం అందిద్దామనే తలంపు ఆ స్వామే నాకు





కలిగించాడు. దాని ఫలితమే ఈ నా ప్రయత్నం. ఇదే కోవలో భక్తి, వైరాగ్య కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన శ్రీనివాసుని దయ నా ప్రాప్తము.

నా భావన యేమంటే ముగ్గురిలోనూ పెదతిరుమలయ్య కవిత కొంచెం అధిక శ్రమపడునట్లు చేస్తుంది. అన్నమయ్య కవిత అలవోకగా వుంటుంది. కాకపోతే మనబోటి నవీన యుగమువారికి అన్నమయ్య కవిత కష్టమే. నాచేత తిరుమలనాథుడు చెప్పించిన దీనినాస్వాదించండి. నేను వాడిన భాష తేలికపాటిదే అవటంవల్ల మీకు నచ్చుతుందని ఆశిస్తాను.

పెదతిరుమలయ్య భార్య తిరుమలాంబ. ఈయన భగవద్గీతను తెలుగు వచనముగా చెప్పాడట. హరివంశాన్ని ద్విపద కావ్యంగా రచించాడట. రెండవది నేడు లభ్యమగుటలేదు. ఆయన “సంకీర్తనా లక్షణము” అనే గ్రంథమునకు వ్యాఖ్య రచించినట్లు చినతిరుమలాచార్యులవారు పేర్కొనినాడు. ఈయనకు అనేక బిరుదులున్నాయట. వేదాంతాచార్య, కవితార్కిక కేసరివంటివి సుప్రసిద్ధములు.

ఆ దంపతుల సుపుత్రుడే చినతిరుమలాచార్యులవారు. ఈయనకు అష్టభాషా చక్రవర్తి అని బిరుదున్నది. తన తాతగారు అన్నమాచార్యుల శిక్షణలో పెరిగిన చిన తిరుమలయ్య తాతగారి కీర్తనలు జీర్ణించుకొని పెద్దవాడైనాడు. సంగీత సాహిత్యాలు

రెండిటిలోనూ దిట్ట. ఈయన నేటి గుంటూరు సమీపమునగల మంగళగిరి నరసింహస్వామిని దరించినట్లు ఒక శాసనముద్వారా తెలియవచ్చుచున్నది. ఈయన కీర్తనలద్వారా నేటి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలోకూడా విశిష్టాద్వైతమత ప్రచారానికై దర్శించి పెక్కు అర్చావతారములను చినతిరుమలయ్య దర్శించి కీర్తనలు చెప్పినాడు. అలమేలుమంగాపురంలోని పెక్కు జీర్ణమైన ఆలయములను పునరుద్ధరించినాడు.

"హరి సేవకే వేంకటేశ మకుటం" అనే ఈ నా రచనలో మొదటి రెండవ సంపుటములలో శృంగార కీర్తనలు మూడు నాలుగు సంపుటములలో వైరాగ్య కీర్తనలు ఐదు, ఆరవ సంపుటములలో భక్తి కీర్తనలు చెప్పాలని నా ఆకాంక్ష. ఆపైన తిరుమలేశుని దయ నా ప్రాప్తము. తాత తండ్రి మనుమడి కవితా ఒరవడి పాఠకుల మన్నన అందుకొనేట్లు ఏడుకొండలయ్య దీవెనలకు ఆశపడుతున్నాను. లేకున్న ఇంత బృహత్ ప్రయత్నం నెరవేరేనా?

తండ్రుల దీక్షను తనయులు కొనసాగించటము ఈ నవీన కాలంలో తండ్రుల మాటవినే పుత్రరత్నాలే, రత్నాలవలె అల్పసంఖ్యలో వున్నారు. ఇక తండ్రి దీక్ష తమకేం పని అనుకోవడంలో ఆశ్చర్యమేముంది? కాని పెద తిరుమలయ్య వంటి కొడుకులు, చినతిరుమలయ్యవంటి మనుమలువున్న అన్నమయ్యలు నేటియుగంలో కానరారు. అందుకే నాఈ



హరి సేవకే వేంకటేశమకుటం

భగవత్సేవకు ఈ పేరు సరిపోతుందని భావిస్తాను.

ఇందులో 50 కీర్తనల సంపుటమునొకదానిని ఆడియో సి.డి.గా వెలువరించాలని నా ఆకాంక్ష. నా మిత్రులు విన్నకోట మురళీకృష్ణగారి సహకారంతో నా కోరిక తీరుతుందని నా ఆశ.

నా ఇతర రచనలన్నీ భగవద్సేవాభాగమే. అవన్నీ Google Site లో geetadeeksha.com లో లభ్యమవుతాయి

**తిరుమల తిరుపతి దేవస్థానములవారికి సదా కృతజ్ఞుడను**











సంఖ్య : 435 సంపుటము : 15 పుట: 292 రాగం : కాంబోది

**1 అటుగాన శరణంటి నపరాధము లెందుకు**
**తటుకున బ్రదికించి దయఁజూడవే** ||పల్లవి||

**యెంచరాని నేరములు యిన్నిఁ జేసి యేలికకు**
**వంచనతో మొక్కితే భావము గరఁగు**
**పొంచిపొంచి వెగటుగాఁ బోరినవాఁ డైనాను**
**మంచిమాటలాడితే సమ్మతి హితుఁడౌను** ||అటు||

**ఆనాజ్ఞ దోసినట్టి యాతఁడై నా యేలికకు**
**కానిక చేతికిచ్చి తేఁ గరుణ పుట్టు**
**మోసముతో సొమ్మెల్లా ముచ్చిలించి తిని వచ్చి**
**దీనతతో లెంకయైతే దిగులెల్లాఁ బోవును** ||అటు||

**వాలాయించి దూరుచేసి వచ్చియైనా యేలికెకు**
**వేళగాచి కొలిచితే వేడుక పుట్టు**
**యీలీల శ్రీవేంకటేశ యే జాతివాఁడై నాను**
**మూల నీ ముద్ర మోచితే మునుపే రక్షింతువు** ||అటు||

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య సంకీర్తన నాస్వాదించండి. స్వామీ! అందుకనే నీకు శరణన్నాను. శీఘ్రముగ నాకు బ్రతుకు (సద్వర్తన) నిచ్చి కరుణించవయ్యా! దాసుని తప్పులు దండముతోసరి అంటారు కదా! ఇంకా నా అపరాధముల నెంచుటేల? ఎంచరాని నేరములు చేసినా నేలబడి మ్రొక్కితే కొద్దిగానైనా కరుణాభావము కలుగుతుంది. అనేక పర్యాయాలు వంచనతో పోట్లాట పెట్టుకొన్న వాడైనా, తప్పు గ్రహించి ఇష్టపూర్వకంగా మంచి మాటలు మాట్లాడితే వాడు కూడా హితుడౌతాడు. ఆజ్ఞ నతిక్రమించినవాడైనా ఏలికకు కానుకలు సమర్పిస్తే వాడిపై కరుణ కలుగుతుంది. మోసం చేసి మొత్తం సొమ్ములు దోచుకొన్నవాడైనా దీనుడై నీబంటునని అంటే ఆ ప్రభువు వాడిని దిగులు పోవునట్లు ఆదుకొని క్షమిస్తాడు. నిర్బంధపెట్టి నిందించిన వానినైనా ఏలికను "అన్యధా శరణం నాస్తి" అని వేళలెంచక కొలిచితే పోనీలే అని వేడుక కలిగి క్షమిస్తాడు. అదే విధంగా, యే జాతి వాడైనా నీ ముద్రలు ధరిస్తే.... ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వాడిని అన్నిటికంటే ముందే రక్షిస్తావు.

★ **వాలాయించి** – నిర్బంధపరచి ★ **వెగటుగ** – విరసముగ





సంఖ్య : 114 సంపుటము : 15 పుట: 76 రాగం : గుండక్రియ

**2 ఇన్నాళ్లు నందు నిందు యేమి గంటిని**
**అన్నిటా శరణు చొచ్చి హరి నిన్నుఁ గంటిని** ||పల్లవి||

**అంగనల పసఁ జిక్కి అలయికలే కంటి**
**బంగారువెంటఁ దగిలి భ్రమ గంటిని**
**ముంగిటి క్షేత్రము లంటి ముంచి వెట్టి సేయఁ గంటి**
**అంగవించి నేఁ జూచి అంతరాత్మ గంటిని**

**చుట్టాలఁ జేరి చూచి సుద్దులవావులు గంటి**
**మట్టు లేని వయసుతో మదము గంటి**
**వట్టి కామ్యములు సేసి వరుస మాయలు గంటి**
**పట్టి నారాయణ యని భక్తి నిన్నుఁ గంటిని**

**వింత చదువులవల్ల వేరే మతములు గంటి**
**పంతపు కర్మమువల్ల పాపము గంటి**
**యింతట శ్రీ వేంకటేశ యిటునా జీవభావము**
**చింతించి అందులో నీ శ్రీపాదములు గంటి**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ఏమంటున్నారో వినండి. ఇన్నాళ్ళు నా జీవితంలో అందునిందు (నా గత జీవితంలోను, నేటి నా శరణాగతి బొందిన జీవితంలోను) నేను యేమి కంటిని? ఓ శ్రీహరి నీకు శరణాగతుడనై నిన్నే కంటిని. ఇన్నాళ్ళూ స్త్రీల వ్యామోహంలో జిక్కి అలిసిపోయాను. బంగారం వెంట పరుగులుపెట్టి భ్రమలో తగులుకొన్నాను. నా ముంగిలి నా పొలము అనుకొని వాటికోసం వెట్టిచాకిరీ చేశాను. అటు తరువాత నా బలహీనతల నతిక్రమించి, నాలోని అంతరాత్ముని (హరిని) గంటిని. ప్రభూ! నా చుట్టాలతో సంబంధాలు పెట్టుకొని వాళ్ళ విషయాలలో తలదూర్చి వాచిపోయి చీకాకులు పడ్డాను. వయస్సు అందించిన మదముతో వెంపర్లాడాను. కోర్కెలు తీరక అవి వరుసగా పెరిగిపోతుంటే వాటి మాయలో పడ్డాను. ఇక ఇది పనికాదని పంతముతో నారాయణునిపై భక్తిని పొందాను. ఏవేవో పురాతన శాస్త్రాలు చదివి ఆ మతములో సతమతమయ్యాను.ఆ మతము చెప్పిన కర్మవల్ల పాపం మూట గట్టుకొన్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆపైన నా జీవితం పరమార్ధం గ్రహించి అందులోనే నీ పాదపద్మములను కంటిని.

★ **అలయిక** – అలసిపోవుట ★ **అంగవించు** – ఆక్రమించు ★ **మట్టు** – మితి

సంఖ్య : 385  సంపుటము : 15  పుట: 259  రాగం : బౌళి

**3 పురుషోత్తమా అన్నిటిలో పూసలలో దారమవూ**
**వెర వెతిఁగి ని న్నేపొద్దును సేవించఁగవలెఁ గాని** ॥పల్లవి॥

**కదలును గాలి నీవు కదలించితే**
**పొదలును సస్యములు నీవు పొదలించితే**
**వెదకితే కీలు నీవే విశ్వంబునకు**
**పదిలముగా నిను వెదకి పట్టఁగవలెఁ గాని**

**కాలముఁ గర్మములో నీవు కానరాక వుండి**
**నేలయు మిన్నును నీవే పాలింపుచున్నాఁడవూ**
**నీ లీలలైన బొమ్మలాట లివి నీచేతనాడీని**
**కోలుముందుగా నీ సాకారము కోరి చూడవలెఁగాని**

**యిత్తువు వరములు నీవే యిటు శ్రీవేంకటగిరిని**
**మొత్తమై యలమేల్మంగతో ముద మలరఁగాను**
**బత్తితో నినుఁ గొలిచినవారికి పరుసవేదివి నీవే**
**కొత్తలుగా నిన్నే నమ్మి కొలిచి బ్రదుకవలెఁగాని**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ అధ్యాత్మ కీర్తనలో భగవద్గీతావాక్యాన్ని ప్రవచిస్తున్నారు. పురుషోత్తముడైన శ్రీహరి హారములోని పూసలను ఒకటిగి సంధించే దారము యెలా కనబడదో, ఆ విధంగా తానూ అగోచరుడు కాని సూత్రధారి. మానవుడు ఈ జన్మబంధాలనుండి తరించాలంటే ఓ జగన్నాథా! నిన్ను అన్ని వేళలా ధ్యానించవలసినదే. మరోదారి లేదు. నీవు కదలమంటేనే గాలి కదులుతుంది. నీవు పండమంటేనే పొలాలు పండుతాయి. ఈ విశ్వానికి నీవు "కీలు" వంటివాడవు. నీవు అంత తేలికగా కనబడతావా? జాగ్రత్తగా వెదకి నిన్ను పట్టుకోవాలి. కాల కర్మాదులలో నీవు కానరాక వుంటావు. కాని ఈ లోకపాలకుడవు నీవే. అనంతమైన ఆకాశమంతా నీవే పాలించుచున్నావు. అందుకే ఖగోళములోనిదేదీ భూమిని తాకుట లేదు. నీవు తలచుకొన్ననాడు ఏదైనా జరిగి తీరుతుంది. నీ చేతిలోని బొమ్మలాట ఇది. మమ్మల్ని ఆడించి నీవు వినోదిస్తుంటావు. మునుముందుగానే నీ సాకార దర్శనాపేక్ష వుండనిదే అది జరిగేపనికాదు. అలమేల్మంగను యెదలోనే నిలుపుకొన్న శ్రీవేంకటేశ్వరుడవై నీవు మాకు కోరిన వరములన్నీ అనుగ్రహించుచున్నావు. భక్తితో నిన్ను కనుగొన్న వారికి నీవు పరుసవేదివి. నిన్ను నమ్మి కొలుచుచు బ్రతుకుగడుపవలెను.

★ **పరుసవేది** – దీనితో తాకిన యేలోహమైనా బంగారమగును

★ **కీలు** – కదలికకనుకూలమైన అమరిక





సంఖ్య : 80  సంపుటము : 15  పుట: 53  రాగం : గుజ్జరి

**4 ఏమని వున్నదో యీ మనసు**
**కోమల మెప్పుడు కొరతే మనసు** ॥పల్లవి॥

**ముదిసేటివారల ములిగేటివారల**
**కదిసి చూచి కలఁగదు మనసు**
**వదలక యింద్రియవర్గంబులకే**
**వెదకీ నిదివో వీతిడి మనసూ** ॥ఏమని॥

**జననమరణముల చరాచరములను**
**కనియును మీఁదెఱుఁగదు మనసూ**
**ఘనసంసారపుకాణాచులకే**
**దినదినకాంక్షల దిరిగీ మనసూ** ॥ఏమని॥

**కలగని యటు మేల్కని చూచి తెలిసి**
**చెలఁగి రెంట నడచీ మనసు**
**బలిమి శ్రీవేంకటపతి రక్షింపఁగ**
**కొలిచి యాతనికి కొసరీ మనసూ** ॥ఏమని॥

**భావ పరిమళం :**

మనస్సు యొక్క వైచిత్రిని వివరిస్తున్నారు పెదతిరుమలయ్య. తృప్తి అనేదే యెరగదు. ఎంత కోమలమైనదో అంత కఠినమైనది. దీని తత్త్వం ఇంతే అని కూడా అనలేము. ఇది ఇలాంటిది అని నిర్ధారించలేము. ఇది యేమనివున్నదో కదా! ఎంతమంది ముసలివారిని చూచినా, ఆ వృద్ధాప్య పీడితులను చూచినా ఈ మనస్సు చలించదు (తనదాకా వచ్చేదాక, ఇదంతే). ఇది ఎప్పుడూ ఇంద్రియ సుఖాలకోసమే వెంపర్లాడుతుంటుంది. ఇది అవివేకపు మనస్సు. తనచుట్టూవున్న చరాచరములు యెన్ని జనన మరణముల పాలవుతున్నా ఈ మనసు తనకేమవుతుందా అని కలత చెందదు. పోనీ తనకు రాబోయే క్షణంలో యేమి జరుగుతుందో తెలియునా? అదీ సాధ్యంకాదు. ఘనసంసారపు చిరకాలవాసము కోసమే ప్రతిరోజూ కోర్కెలతో తిరుగుతుంటుందీ మనస్సు. కలలు కంటుంటుంది. మెలకువ వచ్చి అది నిజము కాదనీ గ్రహిస్తుంది, ఈ మనస్సు. అయినా ఈ రెంటిమధ్య నలిగిపోతూనే వుంటుంది. బలిమి కల శ్రీవేంకటేశ్వరుడు ఈ మనస్సుని కరుణిస్తాడు. ఆయన రక్షలో ఆయననే కొలిచి కడతేరి, విజృంభిస్తుంటుందీ ఈ మనస్సు.

★ **వీతిడి** – అవివేకపు ★ **కొసరు** – విజృంభించు

సంఖ్య : 57 సంపుటము : 15 పుట: 38 రాగం : గుజ్జరి

**5** చెప్పఁబోతేఁ బస లేదు శ్రీపతిదాసులు నన్ను
తప్పక చేపట్టితేనే ధన్యుఁడ నే నైతిని ॥పల్లవి॥

భ్రమసి పొరలదోలు పై వేసుకొన్నవాఁడ
యెముకల యింటిలో నిరవైనాఁడ
తమితోడ మలమూత్రతతులఁ బాయనివాఁడ
అమర మా కులగోత్ర మడుగ నేమిటికి ॥చెప్ప॥

పుట్టిన చో టడిగితే పూఁచి చెప్పరానివాఁడ
ముట్టరానిచోటనే మునిఁగేవాఁడ
చుట్టుకొన్న వెంట్రుకల జాబులకొప్పువాఁడ
వెట్టి మా యిల్లువరుస వెదక నేమిటికి ॥చెప్ప॥

నానుచున్న నోరిలోని నరాల నాలికవాఁడ
యే నిజమూ నెఱఁగని యెద్దవాఁడనూ
లోనుండి శ్రీవేంకటాద్రి లోకేశుఁడు నన్ను నేలె
తానకపు మా గుట్టు తలఁచ నేమిటికి ॥చెప్ప॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య యేమంటున్నారో వినండి. నా గత జీవితం గురించి చెప్పబోతే, అది పస యేమాత్రం లేనిది. శ్రీపతిదాసులు తప్పక నన్ను చేపట్టి నాకు ధన్యత చేకూర్చారు. అయినా, నా గురించి చెప్పుకోటానికి మాత్రమేముంది చెప్పండి. జీవుడని పిలువబడే నేను భ్రమకు లోనై, పొరలున్న ఒక తోలు తిత్తిలో దూరి యెముకల గూటిలో ఇంటిని చేసికొని పాదుకొని వున్నాను. దాని నిండా మలమూత్రాలే. వాటిని కూడా యెప్పటికప్పుడు విసర్జించనిదే జీవించలేను. ఇంకా అర్థం లేకుండా నీ కులగోత్రాలేమని వీణ్ణి అడుగుతున్నారే మీరెంత వెట్టివాళ్ళు!!! నీవెక్కడనుంచి వచ్చి ఇక్కడపుట్టావురా? అంటే చెప్పలేను. నేను యెక్కడనుంచి పుట్టానో చచ్చేదాకా దానిమీదే వ్యామోహపడుతుంటాను. పోనీ అందంగా పుట్టానా అంటే... అదీ లేదు. ఒంటినిండా వెంట్రుకలు గుబురులాంటి కొప్పు... అదీ అద్దెకొంప లాంటి ఇల్లు. ఎప్పుడు వదలిపెట్టాల్సొస్తుందో తెలియదు. మరి ఈ యింటికోసం వెంపర్లాట యెందుకు, చెప్పండి. దీనినోటినిండా, నరాలే వున్న నాలుక ఒకటుంది. అది యెప్పుడూ చొల్లుతో నానుతూనే వుంటుంది. ఈ విధంగా నా గురించి ఒక్క నిజమూ తెలియని యెద్దెవాడిని. శ్రీవేంకటేశ్వరుడు దీనినేలినంతకాలమూ మా స్థానపు గుట్టు గురించిన చింత, మాకేల?

★ **తానకపు** – స్థానము యొక్క ★ **జాబులకొప్పు** – గుబురుకొప్పు





సంఖ్య : 9 సంపుటము : 15 పుట: 6 రాగం : సాళంగనాట

**6** అట్టివాఁడఁ గనకనే హరి నీదాసుఁడ నైతి
వొట్టిన యపరాధము లొడ్డించుకో వశమా ॥పల్లవి॥

యెన్ని నేరాలైనఁ జేసి యేమిటాఁ దీరని తప్పు
వున్నతి నీ లెంక నైతే వూరకె పోవు
పన్ని పగసేసి వచ్చి బలవంతుని మరుఁగు
తన్ను దానే చొచ్చితేను దక్కిపోవుఁ బనులూ ॥అట్టి॥

వొడ్డిన సొమ్మెల్లాఁ దిని వూనిన ఋణమునకు
బిడ్డపేరు వెట్టితేను బీతి వాసును
అడ్డమై జగడగాని ఆడరానిమాట లాడి
ముడ్డిమీది కెత్తుకొని మొక్కితేనే పోవును ॥అట్టి॥

పాపమే కూడుగ నుండి పట్టి నారా యంటేను
చేపట్టి వైకుంఠ మిచ్చి చేరి కాచితి
యేపున శ్రీవేంకటేశ యిదీ వినే పో నేను
మూఁపున నీ యచ్చు మోచి ముందర నిలిచితి ॥అట్టి॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య యేమంటున్నారో వినండి. ఓ శ్రీహరీ! నేను అట్టివాడను కాబట్టే నేను నీదాసుడనైనాను. నేను చేసిన అపరాధములనెన్నని చెప్పను? వాటినేకరువుపెట్టుట నాకు సాధ్యమా? ఎన్ని నేరాలు చేసినా పశ్చాత్తాపము చెంది, నీ బంటు అయితే వాడి తప్పులన్నీ తేలిపోతాయి. తప్పు చేసి వచ్చినా బలవంతుని ఆశ్రయిస్తే తనకి తానే దయవేడితే, పనులన్నీ సక్రమంగా నెరవేరుతాయి. గొప్ప ధనవంతుని వద్ద ఋణము తీసికొని తీర్చలేక అయ్యా! నన్ను మన్నించు నా బిడ్డకు నీపేరు పెట్టుకొంటాను, అంటే కరుణించకపోడు. ముడ్డిపైకెత్తి కాని కాళ్ళకు మొక్కినచో, పోట్లాట వచ్చే మాట అన్నా జగడము రాదు. పైగా దోషమూ మన్నించబడుతుంది. అన్ని పాపాలు చేసిన అజామీళుడు చచ్చే సమయంలో “నారాయణ” అన్నంతమాత్రాన వైకుంఠ ప్రాప్తిని పొందాడు. అటువంటిది నీదయ. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇది విన్నాకనే నా మూపుమీద నీ శంఖుచక్రముల ముద్రలను పొంది వైష్ణవుడనయ్యాను, ప్రభూ!

★ **దక్కిపోవు** – చక్కబడుతవి ★ **మూపున** – భుజశిరము

సంఖ్య : 358 సంపుటము : 15 పుట: 241 రాగం : రామక్రియ

**7 కంబములో వెడలితివి కరిరాజుఁ గాచితివి**
**పంబి యిన్నిటా నీకిది పనియటే శ్రీహరీ** ॥పల్లవి॥

**యెవ్వఁడూ మొఱవెట్టునో యిట్టె రక్షించే ననుచు**
**యెవ్వఁడూ ననుఁ బేర్కొనునో యింతటాఁ బలికేననుచు**
**యెవ్వఁడూ మదిఁ దలఁచునో యిక్కువఁ బొడచూపేననుచు**
**వువ్విళ్లూరఁ గాచుకొని వుందువటే శ్రీహరీ** ॥కంబ॥

**ఆపన్నుఁడు శరణంటే నడ్డము వచ్చే ననుచు**
**యేపొద్దు ధ్యానించువానికి యెదుటనుండే ననుచు**
**పైపైఁ బూజించేవానికి పాదములు చాఁచే ననుచు**
**వోపి యెప్పుడు గాచుకొని వుందువటే శ్రీహరీ** ॥కంబ॥

**అడిగి పొగడేవానికి నప్పుడే నొసఁగే ననుచు**
**చిడిముడి నీ దాసునికి చెప్పినట్టు సేసే ననుచు**
**బడినే శ్రీవేంకటేశ భక్తి సేసేవానికిని**
**వుడివోక కాచుకొని వుందువటే శ్రీహరీ** ॥కంబ॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య పరమాత్ముడైన శ్రీహరితో కాస్త చనువుగా యేమంటున్నారో వినండి. ఓ శ్రీహరీ! ఆనాడు స్తంభములో ఆవిర్భవించి హిరణ్యకశిపుని చంపి ప్రహ్లాదుని కాచినావు. చిట్టడవి కొలనుకు వెళ్ళి గజేంద్ర వరదుడవైనావు. అన్నిచోట్లా, నీకిదే పనియటే, ప్రభూ! దేవా! ఎవ్వడు రక్షించమని మొఱవెడితే, వాడి దగ్గరకు పరుగు దీస్తావు. నన్ను పేరుపెట్టి యెవ్వడు పిలుస్తాడోనని యెదురు చూస్తుంటావు. ఎవ్వడు నిన్నే దిక్కని తలచుకొంటాడో వాడిని కాపాడాలి, అని వువ్విళ్ళూరుతూ కాచుకొనవుంటావటే, శ్రీహరీ! స్వామీ! ఆపదలో వున్నవాడెక్కడున్నా శరణు శరణు సురేంద్ర వందిత అని పాడుతున్నాడేమోనని నీకు ఒకటే ఆరాటం. నన్ను సర్వకాల సర్వావస్థలలో ధ్యానించేవాడిని నేను కాకపోతే యెవరు సిద్ధంగా యెదుటనే వుంటారని, నీ తపన. పరవశంతో నిన్ను పూజించేవానిని నేను వహించుకోవాలని పాదములను చాచి, పరుగులెత్తుటకు నీకు ఆతృత వుంటూనేవున్నది. ఓపికతో యెవడు నీదయ యెప్పుడు కావాలంటాడోనని వేగిరపడుతుంటావు. శ్రీమన్నారాయణుడా! నిన్నేదన్నా కోరి, కీర్తించేవానికప్పటికప్పుడే వరాలిస్తావు. నీ దాసులు చెప్పినట్లే నీవు చేయటం, సాటిలేని విడ్డూరం. ఓ శ్రీవేంకటేశ్వరా! నీపై భక్తి వున్నవానికి, నీవెన్నడు తొలగక కాచుకొనివుంటావట. ఓ శ్రీహరీ! అందుకే నిన్ను నేను వొదలలేనయ్యా!

★ **ఉడివోని** – తొలగని ★ **పంబి** – అతిశయించి





సంఖ్య : 188 సంపుటము : 15 పుట: 125 రాగం : శుద్ధవసంతం

**8 చెల్లుబడీ కల్లలట చేఁత లివి నీవియట**
**బల్లిదుఁడ హరి మమ్ము భ్రమదెలుప వయ్యా** ॥పల్లవి॥

**వొకసస్యమునఁ బంట వొకకోటి కొండ లట**
**వొకపశువునందు పా లూరేదట**
**అకట కొందరవి అంతలో చవిగొనిన**
**సకలంబు దీరునట సటకు నిజమేదీ** ॥చెల్లు॥

**అన్నంబు గొనెడిదట యప్పటినాఁకలియట**
**తిన్ననై కొంతదడవు తృప్తినటా**
**కన్నులనే నిద్రలట కడఁగి మేల్కనుటయట**
**యిన్ని బొంకులజగము యెట్ల నమ్మెడిది** ॥చెల్లు॥

**కాయమట ప్రాయమట కాంతలట పురుషులట**
**రాయిడింపులె మతికి రతిసుఖమటా**
**యే యెడల శ్రీవేంకటేశ నీమాయ లివి**
**పాయునట నీదాసపరికరములకును** ॥చెల్లు॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య శ్రీవేంకటేశ్వరుని మాయను వేనోళ్ళ పొగడుతున్నారు. ఎంతమాయ, యెంత భ్రమ, కల్పిస్తావయ్యా!! కల్లల్ని నిజాలు చేస్తావు, బొంకుల్ని నమ్మిస్తావు. క్షణంలో కరిగిపోయే రతి సుఖంతో పిచ్చిపుట్టిస్తావు. ఒక్క నీ దాసులు తప్పించి ప్రతివాడికీ హరిమాయ అసాధ్యము. ఒక పొలము విరగబండునట. దాని చుట్టూ వేలాది కొండలుంటాయట. ఒక పశువుకి అమృతధారల వంటి పాలు చేపితే వందల పశువులకి పాలురావు. అందరికి ఆ పాలే దిక్కంట. ఇదేమి నిజము స్వామీ!! అన్నం తిన్నప్పుడే తృప్తి. ఆ తరువాత మళ్ళీ మొదటికే, ఆకలి... తిండి... తృప్తి... మళ్ళీ ఆకలి. ఇది యెడతెగని పీకులాట. ఇంత బొంకులమారి జగమును సృష్టించావే... దీన్నెలా నమ్మగలనయ్యా? ఇక మమ్మల్ని చూడు. మాకీ పీడ తగిలించావేమయ్యా? దేహమట, దానికో యౌవనమట దానితో స్త్రీ పురుషులనే భేదం లేకుండా అందరికీ రతి సుఖమనే పిచ్చెక్కిస్తావట. ఒకేదారి వుంచావట. “అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ” అనే నీ దాసుల్ని మాత్రం యేమీ చేయవుట.

★ **చెల్లుబడి** – అధికారము ★ **సటకు** – కపటము

సంఖ్య : 13 సంపుటము : 15 పుట: 9 రాగం : బౌళి

**9 చదివేవి వేదము లాచారము మదిఁ బట్టదు**
**మదనాతురుఁడ నాకు మంచితన మేది ॥పల్లవి॥**

**ముట్ట యోగ్యము గానివి మోచితిఁ దోలు నెమ్ములు**
**అట్టె బ్రతికేననే ఆసలు బెట్టు**
**జట్టిగాఁ బ్రాణము తీపు చావంటే వెలుతు నేను**
**యిట్టి యజ్ఞానికి జ్ఞాన మెట్టు గలిగీని ॥చదివే॥**

**కావలె ననుచుఁ గోరి కడుపు నించిన రుచి**
**యావల హేయమై వెళ్లీ యేఁ జూడగానే**
**దావతి మన సందుకే తగిలీఁ గాని రోయదు**
**భావించి. నన్నెఱుఁగని భావ మెరిఁగీనా ॥చదివే॥**

**యోని గతుఁడనై పుట్టి యోనికి మగ్నుఁడనైతి**
**పూని లోకబంఁడఁ డనే బు ద్ధితిఁగీ**
**నేనా యెంత సి గ్గెఱుఁగ నీవే విచారించి కావు**
**శ్రీనిథి శ్రీ వేంకటేశ చేతిలోని వాఁడను ॥చదివే॥**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య కీర్తన పశ్చాత్తాపతప్తుడు శ్రీహరితో యేమి మొఱపెట్టుకొంటున్నాడో ఆకర్ణించండి. ప్రభూ! జన్మతః వచ్చిన సంస్కారం వల్ల వేదములు చదివాను, కాని అవి విధించిన ఆచారములు నామతికెక్కవు. మంచితనమన్నదే నాలో లేదు. ఎల్లవేళలా కామాతురుడను. ఇంకా యెన్ని అవలక్షణాలో యేమి చెప్పనయ్యా? తాకటానికి కూడా యోగ్యతలేని వాటినన్నిటిని మోస్తున్నాను. తోలు తిత్తి లాంటి శరీరం. దాంటో హేయమైన ఒక యెముకలగూడు. కాని దాంట్లోనే కలకాలం వుండాలనే ఆశమాత్రం చావదు. ప్రాణంమీద తీపి చావంటే భయం మాత్రం పోనేపోవు. మరి ఇటువంటి అజ్ఞానికి జ్ఞానమెలా వస్తుంది? కమ్మగావుండే వంటకాలు నా శరీరంలోకి పోయి హేయమైన మలముగా మారుతోంది. మనస్సు సుఖాలు కావాలని, వెంపర్లాడుతుంది కాని వాటినెన్నటికి "ఱోత" అనుకోదు. వీటన్నిటిని భావించి నన్ను నేనే యెరుగను. మరి నిన్నెట్లా యెరిగెదనయ్యా? నా జన్మ సంభవించింది యోని నుండి. కాని అదే యోని అంటే వ్యామోహం నాకు. లోకంలోకెల్లా బండవాడిని నేనే. ఈనాడు శ్రీవేంకటేశుని కృపవల్ల బుద్ధెరిగి నేనంటే నాకే సిగ్గవుట లేదు. నీవే విచారించి నన్ను రక్షించు. నేనెలాగూ నీచేతిలోనివాడినే.

★ **దావతి** – దుఃఖిస్తుండే ★ **మదనాతురుడు** – కామవాంఛాలోలుడు





సంఖ్య : 176 సంపుటము : 15 పుట: 117 రాగం : సామంతం

**10 ఎంచఁ బోతే మావల్ల నీ కే మున్నది**
**మించిన యీ పుణ్యమెల్ల నీ దింతే కాక ॥పల్లవి॥**

**పోయిన జన్మ మెఱుఁగ పుట్టిన పుట్టు గెఱుఁగ**
**కాయము గరఁగేది యెక్కడో యెఱుఁగ**
**యీయెడ నేమి దలఁచే నెట్టు ధ్యానము సేసేను**
**నీయంత రక్షించే మేలు నీదింతే కాక ॥ఎంచ॥**

**రేపటిసుద్దు లెఱుఁగ రేతిరిసుద్దు లెరుఁగ**
**పైపై సంసారముల భ్రమ యెఱుఁగ**
**చేపట్టి యెట్టు పూజించే సేవ నీ కేమి సేసేను**
**నీ పెంపునఁ గాచే మేలు నీ దింతే కాక ॥ఎంచ॥**

**నే నెవ్వఁడనో యెఱుఁగ నిలుక డేదో యెఱుఁగ**
**ఆనుకొన్న యీ జగము అంతా నెఱుఁగ**
**కోనల శ్రీవేంకటేశ కొలువ నే మెఱుఁగుదు**
**నే నని కైకొన్నమేలు నీ దింతే కాక ॥ఎంచ॥**

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వినమ్రతతో శ్రీహరికి యేమి నివేదిస్తున్నారో వినండి. ప్రభూ! యెంచిచూస్తే మా వల్ల నీకు జరుగుతున్న వుపకారమేమీ లేదు. పైగా మమ్మల్ని సంరక్షిస్తున్న పుణ్యమంతా నీదే. మేము కనీసం నీపై కృతజ్ఞతన్నా చూపుటలేదు. మేమేదో మాకంతా తెలుసు, యెన్నో చదివాం అని విఱ్ఱవీగుతుంటాము. కాని మాకు తెలిసిందేమిటి? నా పోయిన జన్మనెఱుగను, ఇప్పుడు యెట్లా పుట్టానో యెఱుగను, శరీరం ఎలా పెరిగిందో ఎలా ముసలిదైనదో ఎలా నశిస్తుందో యెఱుగను. నిన్నెట్లా తలుచుకోవాలో యెట్లా ధ్యానించాలో యెఱుగను. అయినా నన్ను దినదినగండాలనుంచి రక్షిస్తూనేవున్నావు. నేనెంత అజ్ఞానిని స్వామీ!! రేపేమి జరుగుతుందో తెలియదు. రాత్రి నేను నిద్రిస్తుంటే, యేమి జరిగినదో తెలియదు. ఈ సంసారముపై భ్రమ యెలాపోతుందో యెఱుగను. పూనుకొని నిన్నెలా పూజించాలో తెలియదు. అయినా నాకు మేలు చేస్తూనేవున్నావు. నన్నూ కాపాడుతూనే వున్నావు. పోనీ, నేనెవ్వడనో యెఱుగుదునా? నిలకడ యెట్లా వస్తుందో తెలియదు. పోనీ నేనుండే ఈ పృధ్వి నెరుగుదునా? నా ప్రాంతంలో కొన్ని వూళ్ళనైనా చూడలేదు. కోనలలో వెలసిన ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్నెట్లా కొలువవలెనో యెఱుగను. అయినా నన్ను స్వీకరించి మేలు చేస్తున్నావు. అందుకే శరణంటిమయ్యా నీకు... పురుషోత్తమా!

★ **కోన** – కొండ వెనుకభాగము ★ **కరఁగు** – ద్రవించు

సంఖ్య : 416   సంపుటము : 15   పుట: 280   రాగం : కుంతలవరాళి

**11 మానరాదు నీ కింక మముఁ గావవలెను**
**పేనిపట్టి నీకు నీవే బిరుదులై వున్నవి** ॥పల్లవి॥

**సరవి నిన్ను భక్తరక్షకుఁడని నారదుఁడు**
**పరువడి లోకములఁ బాడిపాడి చాటినాఁడు**
**సరగ నీ యర్థములకు శాసనాలై వేదములు**
**మొరయుచు బ్రహ్మనాల్గు మొగముల నున్నవి** ॥మాన॥

**శరణాగత వజ్రపంజరుఁ డని వాల్మీకి**
**సురలకు రామకథ చూపి చెప్పె గుఱిగాను**
**పొరి నీ సుద్దు లివే పురాణపత్రికలై**
**పెరుగుచు వ్యాసుల పెట్టెలలో నున్నవి** ॥మాన॥

**తారకబ్రహ్మ మవని తగఁ గాశిలో శివుఁడు**
**యేరుపరచి ప్రాణుల కెప్పుడుఁ జెప్పుచున్నాఁడు**
**యీ రీతి శ్రీవేంకటేశ యిందులకు సాక్షులు నీ వరాలు**
**ఆరూఢి గరుడగంభ మండ నేఁ దున్నవి** ॥మాన॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య శ్రీహరిని వేడుకొంటున్న పద్ధతిని చూడండి. ప్రభూ! నీవెంత జగన్నిర్వాహకుడవైనా మమ్ము రక్షించుట మానరాదు. పనివడి నీదాసులు నీకిచ్చిన బిరుదులే నీ దాతృత్వముగా వున్నవి. నీవంటి దాతవుండడనేకదా! పలువురు నిన్ను కీర్తించినారు. నీవు భక్త రక్షకుడవని యేనాడో నారదుడు నిన్ను పాడి శ్లాఘించినాడు. అన్నిలోకములలో పరుగు పరుగున చాటినాడు. బ్రహ్మదేవుని నాల్గు మొగములూ, నాలుగు వేదములను వల్లించి ఇదే నీ తత్త్వమని చాటినాడు. ఓ దేవదేవా! నీవు శరణాగతులకు వజ్రపంజరము వంటి, రక్షకుడవని వాల్మీకి మహర్షి తాను రచించిన రామాయణములో చాటినాడు. దేవతలు కూడా ఆ రామకథను పాడుకొంటారు. వ్యాసుడు తన భాగవతములో చెప్పిన నీ కథలే పురాణములై జగతిలో వర్ధిల్లు చున్నవి. సాక్షాత్తుగా పరమశివుడే నీవు తారక బ్రహ్మవని కాశీనగరమున చాటి, అక్కడ మరణించినవారికి రామనామము ప్రాణముపోవు సమయమున ఉపదేశించి మోక్షప్రాప్తి గలిగించుచున్నాడు. ఈ విధముగా, వో శ్రీవేంకటేశ్వరా! నేను పైజెప్పినవాటికి సాక్షులు నీ భక్తులకు నీవిచ్చేవరాలే. అవన్నీ నేటికీ, ఎక్కిన నీ గరుడ ధ్వజమున వున్నవి.

★ **ఆరూఢి** – ఎక్కినదై ★ **పెట్టెలలో** – భాండాగారములలో





సంఖ్య : 157   సంపుటము : 15   పుట: 104   రాగం : మలహరి

**12 వాదము లేఁటికి వలసిన వారికి**
**వేదము గలుగఁగ వెల్లి విరాయ** ॥పల్లవి॥

**దైవం బొకఁడె తత్త్వజ్ఞానికి**
**భావింపఁ బలువురు భ్రాంతునికి**
**వేవేలకు మరి విత్తు వొక్కటే అది**
**కావఁగఁ బూవఁగ ఘనమైనట్లు** ॥వాదము॥

**భువి సాకారము పూర్ణజ్ఞానికి**
**అవల నిరవయవ మధమునికి**
**అవళు గలిగికా అష్టపుత్రులును**
**భవములు శ్రీహరిపాలనె కలిగె** ॥వాదము॥

**శరనాగతియే శాస్త్రజ్ఞానికి**
**సరవిఁ గర్మమె జడునికిని**
**నిరత శ్రీవేంకటనిలయు మాయ లివి**
**యిర వెఱుఁగు వారి కిహమే పరము** ॥వాదము॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ చక్కటి కీర్తనలో యేమంటున్నారో వినండి. దేవుడు ఒక్కడేనా? ఆయన సాకారుడా, నిరాకారుడా? శరణాగతి మేలైనదా, లేక శాస్త్రజ్ఞానముతో పరమాత్మనెరుంగవలెనా? యజ్ఞయాగాలవల్ల పరంధామము పొందవచ్చునా? భగవంతుడు వలసిన వారికి ఈ తర్కమీమాంసలెందుకు? జ్ఞానమే చాలు అనుకొనేవారికి వేదము లేనాడో పరమాత్మ తత్త్వాన్ని విశదపరచాయి. నిజమైన తత్త్వజ్ఞానికి దేవుడు ఒక్కడే. భ్రాంతిజెందే పామరునికే అనేకమంది దేవతలు. వేల కొలది వ్రేళ్ళున్న వృక్షానికైనా విత్తనం ఒక్కటే కదా! పైగా, విత్తు కేవలం ఒక చిన్న గింజ. అదే కాచీ, పూచీ, శాఖోపశాఖలై వ్యాపించినట్లు పరమాత్మ తత్త్వం విస్తరించింది. పరమాత్మ పూర్ణుడని గ్రహించినవారికి ఆయన సాకారుడే. అణువణువున ఆయనే వున్నాడు. మధ్యములు ఆయనెక్కడో వైకుంఠంలో వుంటాడంటారు. అష్ట ప్రకృతులతో వ్యాపించినవాడైనందున అవతారాలూ అవతార పరిసమాప్తులు ఆయనకు అంటకట్టబడినవి. శాస్త్ర విజ్ఞానికి విష్ణువు శరణాగతియే ఉత్తమోత్తమము. జడుడైనవానికి యజ్ఞయాగాది కర్మకాండ వలన పరమాత్మ దిక్కవుతాడు అంటాడు. ఇదంతా మాయకల్పించిన భ్రమ. శ్రీవేంకటేశ్వరుని వునికి తెలిసినవానికి ఆయనే ఇహమూ, పరమూ.

★ **కావగబూవగ** – చెట్టు కాయాలన్నా, పూయాలన్నా ★ **వేవేలకు** – అనేకములకు

సంఖ్య : 18 సంపుటము : 15 పుట: 15 రాగం : శుద్ధవసంతం

**13 మఱఁది యనుచు ధర్మజుఁడు భ్రమసునట**
**యెఱుక తోడి వివేక మెవ్వరియం దున్నది** ॥పల్లవి॥

**గరుడవాహన మెక్కి ఘనబాణుని నరికి**
**తిరిగినా నమ్మరైరి దేవుఁడ వని**
**నరకాసురునిఁ జంపి నాతులఁ బదారువేల**
**వెరసి పెండ్లాడినది వివేకించరైరి** ॥మఱది॥

**బలుశంఖచక్రములు పట్టి బాలకులఁ దెచ్చి**
**తెలిపినా నమ్మరైరి దేవుఁడ వని**
**సొలసి విశ్వరూపము చూపి అగ్రపూజగొని**
**వెలయ నీ మహిమలు వివేకించ రైరి** ॥మఱది॥

**పక్కన ద్రౌపదిఁ గాచి బ్రహ్మచే మొక్కించుకొని**
**దిక్కైనా నమ్మరైరి దేవుఁడ వని**
**దక్కి శ్రీవేంకటేశ యిందరికి వరము లిచ్చి**
**వెక్కసమైతివి నాఁడు వివేకించ రైరి** ॥మఱది॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తన ప్రేరేపకుడు, సాక్షాత్తూ అన్నమయ్యేనని ఆయన కీర్తనలనాస్వాదించిన నాబోటి సామాన్యుడు చెప్పగలిగిన సత్యం. దేవదేవా! తమ కనులయెదుటే నీవన్ని మహిమలు చూపినా, ఆ ద్వాపరయుగం అజ్ఞానులు నీవే శ్రీహరివి అని గ్రహించలేకపోయారు. అవనికి దిగివచ్చిన యమధర్మరాజు పుత్రుడు కూడా, నీవు తన మఱది వనే భ్రమించాడు. ఇక వివేకము యెవ్వరియందున్నది? ఆనాడు గరుడ వాహనమెక్కి ఘనుడైన ఈశ్వర వరప్రసాది బాణాసురిని నరికి తిరిగినా, విష్ణుడవని నమ్మలేకపోయారు. నరకాసురుని వధించి వాడు చెఱబట్టిన పదియారువేలమంది రాచకన్నెలను పదియారువేల కృష్ణులై పెండ్లాడినా నీవు శ్రీహరివని వివేకించరైరి. శంఖచక్రములను పట్టి యముని నడిగి గురుపుత్రుని బ్రతికించి చూపినా నారాయణుడవని నమ్మరైరి. కురుసభలో ధృతరాష్ట్రునికి దివ్యదృష్టినిచ్చి విశ్వరూపం చూపించినా మాధవుడవని నమ్మనేలేదు. నీ మహిమను వివేకించలేకపోయారు. ఆనాడు నిండు పేరొలగమున ద్రౌపదికి అక్షయవస్త్రములనొసగినా, బాలుడవైన నిన్ను బ్రహ్మదేవుడే ప్రస్తుతించినా నా దిక్కు నీవే అనినా, నమ్మరైరి నీవే శౌరివని. ఈనాడు శ్రీవేంకటేశ్వరుడై ఇందరికి వారు కోరిన వరాలిస్తున్నా కొందరు దౌర్భాగ్యులు వివేకించలేరైరి. ఏమి విష్ణు మాయ ప్రభూ!

★ **వెక్కసము** – దుర్లభము ★ **వెరసి** – లెక్కకు చూపి





సంఖ్య : 164 సంపుటము : 15 పుట: 109 రాగం : భూపాళం

**14 నీదాఁక వలెనా నిఖిలము వారికెల్ల**
**ఆది నీ దాసుఁడె చాలు నందరి రక్షించ** ॥పల్లవి॥

**నీ పాదమూలముల నిలిచిన జలములు**
**మోపుగా మోఁచె రుద్రుఁడు ముందు ముందె**
**కాపాడు నీ నామమునఁ గలిగిన మహిమచే**
**పైపై మునులు యిహపరములు గనిరి** ॥నీదాక॥

**పండేటి పాలవెల్లి నీ ప్రసాదమునఁ గాదె**
**దండిగా దేవతలెల్లా ధన్యులైరి**
**అండనె నీ సాకార మాతుమఁ దలఁచి కాదె**
**నిండిన యోగీంద్రులు నిత్యముక్తులైరి** ॥నీదాక॥

**చేరి నీ విహారమైన శ్రీ వేంకటాద్రి గాదె**
**కోరివరము లందరు కొల్లగొనిరి**
**ఆ రీతిఁ దాళ్లపాక అన్నమయ్యఘనుఁడాయ**
**వారివారమైన నేము వహికి నెక్కితిమి** ॥నీదాక॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య వేంకటనాథునితో యేమని అంటున్నారో చిత్తగించండి. స్వామీ! నాలాంటి అల్పప్రాణిని రక్షించటానికి నీదాకా రావాలా? మాబోటివాళ్ళందరికీ నీ దాసులే చాలు, నీవు రక్షించటానికి యే గజేంద్రుడో, ద్రౌపదియో వుంటూనే వుంటారు. నీపాద జలమైన బ్రహ్మకమండలంలోని జలము ఆకాశగంగయై శంకరుని జటాజూటమున మోయబడుచున్నది. మునీశ్వరులందరూ ఇహమున నిత్యానందము పరమున బ్రహ్మానందమును పొందిరి, దేనివలన? నీ నామజపమువలన. నీవు పవ్వళించు క్షీరసాగరము కృపజేత దేవతలంతా ధన్యులైరి. నీ సాకార రూపమును ఆత్మలో స్మరించుట చేతనే కదా! యోగీంద్రులందరూ నిత్యముక్తులైనారు. ఇక మానవులు మాత్రం తక్కువ తిన్నారా? స్వామీ! నీ విహారస్థలమైన శేషాచలమును చేరుకొనే కదా! వాళ్ళంతా నీ నుంచి కోరిన వరాలను కొల్లగొట్టుకొన్నారు. అంతెందుకు ప్రభూ! ఆనాడు తాళ్ళపాక అన్నమయ్య నీమూలంగా ధన్యుడైతేనేకదా! ఆయన అనుయాయులమైన వారివారమెల్లా గణుతికెక్కితిమి. శ్రీ వేంకటేశా ఈ ఆకలికాలంలో కూడా నాబోటి వారు, వారి కీర్తనలవల్ల నీ సేవాభాగ్యము పొందుచున్నాము.

★ **నిఖిలము**– జగము ★ **పాలవెల్లి** – క్షీరసాగరము

సంఖ్య : 342 సంపుటము : 15 పుట: 230 రాగం : ఛాయనాట

**15 ఏల లోకులకుఁ జూపే వింద్రాదులఁ బితరుల**
**యీ లీల నిన్నుఁ బూజించే దెక్కుడు గాఁబోలును** ॥పల్లవి॥

**యిక్కువ గొల్లలుచేసే యింద్రయాగము మాన్పి**
**నిక్కి కొండకుఁజేయించి నీవే భుజించితివి**
**వెక్కసమై కిరీటిగావించే శివపూజ మాన్పి**
**గక్కన మోఁకాలఁ బూజ గావింపించుకొంటివి** ॥ఏల॥

**ముంచి మీఁదుగాఁ జేసిన మునుల యజ్ఞాన్నములు**
**కొంచక నీవు దెప్పించుకొంటి వా సతులచేత**
**పొంచి దూర్వాసడిగిన భోజనము లటు మాన్పి**
**అంచెఁ బాండవుల బలుసాకునాఁ దృప్తైతివి** ॥ఏల॥

**సారె గోపికలిండ్ల జన్నెవట్టినది మాన్పి**
**నేరుపుతోఁ బాలు వెన్న నీవే యారగించితివి**
**ధారుణిలో వేదోక్త ధర్మము నీవే నిలిపి**
**కారణ మింతకు శ్రీవేంకటేశ నీ వైతివి** ॥ఏల॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య యేమంటున్నారో వినండి. ఓ కొండలరాయా! యెందుకు ఈ లోకులు వ్యర్థముగా ఇంద్రాది దేవతలను పరమపదించిన పితృదేవతలను పూజిస్తారు? వారందరికీ అధినాయకుడవైన పరబ్రహ్మావు, నిన్నే పూజిస్తే చాలదా? అదే అన్నిటికంటే యెక్కువకదా! ఇది నీవేనాడో ద్వాపరయుగంలో బాలకృష్ణయ్యగా నందాది గోపకులకు నచ్చజెప్పి గోవర్ధనగిరిని పూజించమన్నావు. ఆ నైవేద్యం నీవే భుజించావు. అర్జునుడు చేసే శివపూజ మాన్పించి, మోకాళ్ళపైబడిపించి నీకే పూజ చేయించుకొన్నావు. మునులు యజ్ఞంచేస్తే, వారి భార్యలచేత యజ్ఞాన్నమును తెప్పించుకొని తృప్తి చెందానన్నావు. నీవే యజ్ఞభోక్తవని అట్లా చెప్పకనే చెప్పావు. దుర్యోధనుని పన్నాగమునకు జిక్కి దూర్వాసుడు, అతిధిగా వచ్చిన తనకు శిష్యసమేతంగా భోజనం పెట్టమని, స్నానానికి వెళ్ళాడు. అక్షయపాత్రను కడిగివేసిన ద్రౌపది, భర్తలతోపాటు శ్రీకృష్ణుని ప్రార్థించింది. కృష్ణుడు ప్రత్యక్షమై పాత్రను తెప్పించి చూస్తే అందులో చిన్న బలుసాకు తునక వుంది. అది తిని కృష్ణుడు త్రేనిచి దూర్వాసునికి త్రేనుపులు తెప్పించి మునిని తినలేననిపించాడు. గోపికలు జన్నెవట్టిన ఆవుల క్షీరమునుండీ నీవే పాలు వెన్నలను స్వీకరించినావు. అవనిలో వేదోక్తధర్మమును నిలుపుటకు శ్రీవేంకటేశ్వరా! నీవే కారణమైనావు.

★ **జన్నెవట్టిన** – దేవతలకై త్యజించిన ★ **కొంచక** – సంకోచించక



హరి సేవకే వేంకటేశమకుటం

సంఖ్య : 389 సంపుటము : 15 పుట: 262 రాగం : నాట

**16 ఎక్కడ దాఁగఁగ వచ్చు నింక నీకును**
**పక్కన నీ దాసులెల్లా బ్రదికిరి యింకను** ॥పల్లవి॥

**పంతాన నెక్కడాఁ జిక్కువడనియట్టివాఁడవు**
**చింతల నీ కథలలోఁ జిక్కుకొంటివి**
**యెంతైనా నీ మహిమల నెంచరానివాఁడవు**
**దొంతర సహస్రనామాదుల నెన్నికైతివి** ॥ఎక్కడ॥

**సరుగ నెవ్వరిచేత సాధింపరానివాఁడవు**
**వొరసి నీ భక్తిచే సాధ్యుండ వైతివి**
**సురలకు నీ గుఱుతు చూపరానివాఁడవు**
**బిరుదులచే గుఱుతు పెట్టించుకొంటివి** ॥ఎక్కడ॥

**వేదములచే నీ రూపు వెదక రానివాఁడవు**
**పోదితో శ్రీవేంకటాద్రిఁ బొడచూపేవు**
**యేదెస నీ వొక్కఁడవే యేలికైనవాఁడవు**
**మేదిని యలమేల్మంగ మెడఁగట్టుకొంటివి** ॥ఎక్కడ॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య యెంత నిష్కర్షగా స్వామిని యెదిరిస్తున్నారో చూడండి. ఓ కొండలరాయా! ఇంకా నీవు మానుండి యెక్కడ దాగగలవయ్యా? నీ దాసులకు నిన్ను యెలా పట్టుకోవాలో సులువుగ బోధపడింది. ఇక వాళ్ళు బ్రతికిపోయారు. నీవు పట్టుబడిపోయావు. ఏ పంతగాడికీ పట్టుబడని వాడవు నీవు. కానీ నీ కథాశ్రవణం జేసే చోట నీ అంతట నీవే పట్టుబడి పోతావు. ఏవిధంగానైనా నీ మహిమ యెంతటిదో నెంచరాని వాడవు, నీ సహస్రసామపారాయణ చేస్తే జ్ఞానం సిద్ధిస్తుంది. ఎవ్వరిచేత సాధింపబడని వాడవు భక్తిచేత సాధింపబడుచున్నావు. దేవతలు కూడా నినున యేవిధంగా గుర్తించవచ్చునో చెప్పలేకపోతున్నారు. అందుచేత దేవతలు నీ శౌర్యము చేతనే వారి రక్షకుడవని గుర్తించిరి. వేదములు కూడా నీ రూపమిట్టిదని తెలుపలేకపోతున్నాయి. అందుకనే మాబోటి సామాన్య మానవుల కోసం శ్రీవేంకటాద్రిపై పొడచూపినావు. అన్ని అర్చావతారములలో తిరుమలయ్యగా గుర్తించుటకు అలమేల్మంగమ్మను నీ వురముపై మోస్తున్నావు.

★ **పోదితో** – గుంపుగా ★ **ఒరసి** – విచారించి

సంఖ్య : 448 సంపుటము : 15 పుట: 301 రాగం : దేసాళం

**17** **నీ వెంత నే మెంత నీ కృప యెంచుట గాక**
**భావింప స్వతంత్రుఁడవు పరమేశ్వరుఁడవు** ॥**పల్లవి**॥

**సాదించరానివాఁడవు సకలోపాయములను**
**సాదించరానివాఁడవు చొచ్చి వెదకి**
**సాదించరానివాఁడవు వాకుచ్చి యెవ్వరికిని**
**పాదుకొనఁ గొలిచితే భక్తసులభుఁడవు** ॥**లల**॥

**మించరాని వాఁడవు మేటిసురలకు నైనా**
**యెంచరానివాఁడవు యిట్టట్టనుచు**
**వంచరానివాఁడవు వడిఁ బ్రతాపములను**
**పంచనుండి నుతించితే భక్తసులభుఁడవు** ॥**లల**॥

**పట్టరానివాఁడవు బలిమి నేరుపులను**
**ముట్టరానివాఁడవు మొక్కలానను**
**నెట్టన శ్రీవేంకటేశ నీ వెదుట నున్నాఁడవు**
**బట్టబయలు మొక్కితే భక్తసులభుఁడవు** ॥**లల**॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య చెప్పిన భక్తిరస ప్రధానమైన కీర్తననాస్వాదించండి. ప్రభూ! నీవెంతటి దేవదేవుడవు, మేమెంతటి మానవాధములము? నీకృప నాశించుట తప్పించి, సర్వస్వతంత్రుడవైన పరమేశ్వరుడవు నీకు మాకు సాపత్యమేమున్నది? సర్వోపాయములచేత సాధింపరానివాడవు. ఏచోట వెదకినా సాధింపరానివాడవు. వీరిని వారిని వాకబు చేసి యెన్నటికీ సాధింపరానివాడవు. స్థిరనిశ్చయంతో కొలిచిన భక్తులకు మాత్రమే సులభ సాధ్యుడవు. ఉన్నతులైన దేవతాప్రముఖులచేత కూడా మించబడనివాడవు. ఇటువంటివాడు, అటువంటివాడు అని విశ్లేషించబడని వాడవు. ఎటువంటి ప్రతాపము చేతనైనా అణచబడని వాడవు. కాని తామున్నచోటనే వుండి నిరంతరము నిన్ను నుతించే భక్తులకు మాత్రం సులభసాధ్యుడవు. బలవంతంగా గాని, నేర్పరితనము చేతగాని పట్టుబడని వాడవు. శౌర్యము చూపి నిన్ను ముట్టుకొనుటకు సాధ్యముకాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీ నిజభక్తులకు ఎదురుగా సిద్ధముగా వుంటావు. కల్మషము లేకుండా మొక్కే భక్తులకు మాత్రం సులభ సాధ్యుడవు.

★ **మొక్కలాన**–శౌర్యముతో ★ **ఇట్టిట్టనూచు**–ఇటువంటివాడు, అటువంటివాడు అనే





సంఖ్య : 140 సంపుటము : 15 పుట: 93 రాగం : గౌళ

**18** **వోవో రాకాసులాల వొద్దు సుండి వైరము**
**దేవుని శరణనరో తెలుసుకోరో** ॥**పల్లవి**॥

**జగములో రాముఁడై జనియించె విష్ణుఁ డిదె**
**అగపడి లక్ష్మి సీత యయి పుట్టెను**
**తగు శేషశంఖచక్ర దైవసాధనము లెల్ల**
**తగిలి లక్ష్మణ భరత శత్రుఘ్నులయిరి** ॥**వోవో**॥

**సురలు వానరులైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు**
**మరిగి రుద్రుఁడు హనుమంతుఁడాయెను**
**సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁ డైనాఁడు**
**వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి** ॥**వోవో**॥

**కట్టిరి సేతు వప్పుడే ఘను లెల్లా దాఁటిరి**
**ముట్టిరి లంకా నగరమును దళము**
**అట్టి శ్రీ వేంకటేశుఁ డాతఁడే యీతఁడై**
**వొట్టుచు వరము లిచ్చె వొనర దాసులకు** ॥**వోవో**॥

**భావ పరిమళం :**

పెదతిరుమలయ్య ఈ కీర్తనలో దానవులను యెలా హెచ్చరిస్తున్నారో చూడండి. ఇది నేటి కలియుగ దానవులకూ వర్తిస్తుంది. కాకపోతే ఈయన తిరుమల వేంకటరాయుడు, మరి దురాచార దుష్టవర్తనులే రాక్షసులు. ఈయన వీరిని చంపకుండా, వీరిలోని చెడుని చంపి, భక్తిని పెంపొందిస్తాడు. ఓరోరి! రాక్షసుల్లారా! వద్దురా! దేవుని శరణు అనండిరా! సన్మార్గంలో బ్రతుకుట నేర్చుకోండిరా! ఇది మీరు విన్నారటరా! భూలోకంలో రాక్షసాంతకుడు శ్రీహరి, రాముడై దశరథునికి జన్మించాడట. లక్ష్మీదేవి సీతయై పుట్టిందట. ఆదిశేషుడు లక్ష్మణునిగా, సుదర్శనచక్రము భరతునిగా, పాంచజన్య శంఖము శత్రుఘ్నుడై రామునికి తోడబుట్టినారట. ఇక మీ భరతం పట్టడమే తరువాయి. ఓరోరి! ఆ నలుగురేంచేస్తారులే అనుకోకండిరా. వారికి సాయముగా సాక్షాత్తు సూర్యుడు కపిరాజు సుగ్రీవుడై జన్మించాడు. దేవతలంతా వానరసేనగా జన్మించారు. స్వయంగా శంభుడు హనుమంతుడై అవనికి వచ్చాడు. మీ లంకను భస్మీపటలం చేస్తాడు. బ్రహ్మదేవుడూ, వూరుకోలేదు, ఆయన భల్లూకరాజు జాంబవంతుడైనాడు. ఒరే! సముద్రం మధ్యలో మీ లంకవుందని మురిసిపోకండి. విశ్వకర్మనీలుడై జన్మించాడు. ఆ కపిశ్రేష్ఠుడు సముద్రంపై వారధి కట్టి చూపిస్తాడు. అదిగో అవలీలగా సముద్రం దాటి వానరసేన వచ్చేస్తోంది. లంకను ముట్టడించారు కూడా. పోనీ శ్రీహరియే శ్రీవేంకటేశ్వరుడై తిరుమలలో స్థిరపడతాడట. అక్కడికి వెళ్ళి మొక్కండిరా! మిమ్మల్ని క్షమించి వరాలు కూడా ఇస్తాడటరా!!

★ **వెరవరి** – ఉపాయశాలి ★ **ఒట్టుచు** – శపథంతో

సంఖ్య : 354   సంపుటము : 15   పుట: 238   రాగం : బౌళి

**19 మరియు మతియుఁ బలుమారు నీకే శరణు**
**అతిముతి సకలాంతర్యామీ శరణు** ॥పల్లవి॥

**సరుస మూర్తిత్రయ శరీరానికి శరణు**
**నిరుపమపంచభూతనిలయా శరణు**
**పురిగొన్న చతుర్దశభువనాధారా శరణు**
**గరిమె నింతకు మూలకారణమా శరణు** ॥లల॥

**పలుకఁగరాని పరబ్రహ్మమా నీకే శరణు**
**అలవి మీతినట్టి కాలాత్మకా శరణు**
**విలసిల్లఁ బొడ సూపే విశ్వరూపమా శరణు**
**సలలితబ్రహ్మాండజనకా శరణు** ॥లల॥

**దినకరకోటికోటి తేజమా నీకే శరణు**
**సనకాది యోగీంద్ర సన్నుతా శరణు**
**మునికైన యలమేలుమంగ విభుఁడా శరణు**
**ననుఁగాచే శ్రీవేంకటనాయకా శరణు** ॥లల॥

**భావ పరిమళం :**

ఇది పెదతిరుమలయ్య వినిపించిన చక్కని శరణాగతి, ఆస్వాదించండి. సంభ్రమముగా సకలాంతరాత్మలలో స్థితుడవైన శ్రీనివాసా! శరణు. పలుమార్లు నీకే శరణు వేడుచున్నాను. నన్ను రక్షించు. త్రిమూర్తులకు విభిన్న శరీరములను, విభిన్న తత్త్వములను (సత్త్వ రజస్తమోగుణములు) ప్రసాదించిన పరమాత్మా! శరణు. భూమి, గాలి, నీరు, తేజస్సు, ఆకాశము - అను పంచభూతములను నిర్మించి, నియంత్రించుచున్న నీకే శరణు. పైన ఏడు క్రింద ఏడు మొత్తము పదినాల్గు భువనములను సంరక్షించుచున్న ప్రభూ! శరణు. కనులయెదుటనే, గడచిపోవు కాలమే స్వరూపమైన అగోచరా! శరణు. విశ్వరూపుడవై విలసిల్లె విశ్వమూర్తీ! శరణు– సమస్తము నెలకొన్న ఈ బ్రహ్మాండ సృష్టికర్తా! నీకే శరణు జొచ్చితిని. కోటి సూర్యుల సమూహములు ఒక కోటి వుంటే యెంత తేజస్సు వుంటుందో, అట్టి తేజోమూర్తీ! శరణు. సనకాదిమునిస్తుత్యా శరణు. మాబోంట్లను కాపాడుటకు దేవి అలమేల్మంగను వురముపై నిడుకొనిన తిరుమల వేంకటనాయకా! శరణంటిమయ్యా నీకు పురుషోత్తమా!

★ **అతిముతి** – సంభ్రమము ★ **మనికైన** – వసించిన





సంఖ్య : 95   సంపుటము : 10   పుట: 55   రాగం : నాదరామక్రియ

**20 ఎత్తూ నొరాఁ గల దిటువంటిది వలపు**
**యిత్తరిఁ గాఁకల వన్న(న్నె?) యించుకాఁ దియ్యదు** ॥పల్లవి॥

**మచ్చికతోడుతఁ దూఁగు మంచపుఁ దాసుమీఁద**
**నిచ్చ నింద జవ్వనపు నీవొక్కచో**
**నిచ్చలపు గుణముల నే నొక్కచో నుండఁగాను**
**అచ్చముగా సరిఁ దూఁచె నతనుఁడే యిపుడు** ॥ఎత్తూ॥

**మించి చలువరాయనే మెచ్చుల వొరగంటిపై**
**నించినట్టి వేడుకల నీదేహము**
**దించని తమకపు నాదేహమూఁ బెనఁగఁగా**
**పొంచి సరిగా నొరసె పూవిలుతుఁ డిపుడు** ॥ఎత్తూ॥

**కలసె పూఁబానుపు మొగ్గల గొప్పసళాకలు**
**నిలువున శ్రీవెంకటనాథ నీరతికి**
**కొలఁది మీరఁగ నేఁ గూడిన సమరతికి**
**వలె నని వనె(న్నె?) వెట్టీ వలరాయఁ డిపుడు.** ॥ఎత్తూ॥**95**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన శృంగార కీర్తనలు కూడా బహు క్లిష్టతరమైన చిక్కుముడులు. నాలుగైదు పర్యాయములు చదివినా అంతరార్థం బోధపడుట లేదు. ఏతీరుగ ననుదయజూచెదవో... అని మొరలిడితే.. కొద్దిగా వెలుగు కనిపించింది. దేవి చెలికత్తె శ్రీనివాసుని వేధిస్తున్నది. ఏమని? ప్రభూ! ఇటువంటి తీవ్రమైన వలపును ఈమె యెట్లు వోర్వగలదు? ఇట్లుగాక, ఆమె వన్నెయెందుకు ఒడిలిపోయినది? చనువుతో ఆమె వూయల మంచముపై వూగుచు నిండు జవ్వనముతోనున్న నిన్ను జూచి నిశ్చలములైన నీగుణగణములను చూచి నిన్ను తనువులేని మన్మథునితో పోల్చుకొంటున్నదామె. స్వామీ! అసదృశమైన చలువరాతి భవంతుల చిన్నది ఆమె. ఒరిపిడి రాతిపై వన్నెజూపు మేలిమి వన్నె దేహచ్ఛాయ గల ఆమె, వేడుకతో నీదేహమునకామె దేహపు తమకముతో పెనగగా ఇపుడు పూవిలుకాడైన మన్మథుని ఆగడములూ అధికమైనవి ప్రభూ! మీ తనువులు కలిసే పూలపాన్పుపైనున్న లేతమొగ్గలు సంకెలలవలె గుచ్చుకొనుచున్నవి. ఓ శ్రీవేంకటనాథా! సమరతికి అంగీకరించిన ఆమె కొలది మీరిన నీ రతికి పరవశించినది. కావాలని ఆ కూటమికి వన్నెదెచ్చిన వలరాయడు మన్మథుడు ఇపుడు తానూ దోహదపరచుచున్నాడు.

★ **కొలది మీరిన** – హద్దుదాటిన ★ **మెచ్చులు** – సౌధములు

సంఖ్య : 93 సంపుటము : 10 పుట: 56 రాగం : శుద్ధదేశి

**21** కన్నెపదుచుతో నేమి గయ్యాళించేవు
అన్నిటా మచ్చికైతె నిన్నాపె మించ నోపదా ॥పల్లవి॥

దివ్వెకు మానెవోనె పతిమఁ జూచి ముద్దరాలు
యెవ్వతో వున్నదని యిదె కొంకీని
నవ్వు లేమి నవ్వేవు నాలికాఁడ చెయివట్టి
జవ్వనిఁ దియ్యరాదా చలివాయను ॥కన్నె॥

పొదిగి పాదాలు గుద్దే బొమ్మఁ జూచి గోలయై
అదెవ్వతో వున్న దని అందు కాచీని
యిదేమి వేదుక చూచే వెమ్మెకాఁడ కొంగువట్టి
కదియఁ దియ్యఁగ రాదా కళ రేఁగను ॥కన్నె॥

చేయంటి సురటి వీచే చేఁతాళపు రూప్పు(పు?) చూచి
పాయని దెవ్వతో యని బాల లోఁగీని
కాయజకేలిని శ్రీవెంకటనాథ కూడితివి
ఆయెడ న న్నింద నిల్పి యతిమోదమునను. ॥కన్నె॥ **93**

**భావ పరిమళం :**

చిన తిరుమలయ్య తన తాత అన్నమాచార్యులవారి ధోరణిలోనే, స్వామిని దేవి కొద్దిగా మందలిస్తున్నదన్నారు. ఏమిటయ్యా మరీ చోద్యం? కన్నెపిల్లతో ఏమిటా రండగొండి ప్రవర్తన? నీవు నాతో ప్రేమగా, మచ్చికగా వుంటే నిన్నే మించిపోగలను. ఎందుకు మించిపోను? జగజ్జననియని తెలయదా? దివ్వె పట్టుకొన్న కొయ్య ప్రతిమను నీవు నఖశిఖపర్యంతం చూస్తుంటే అదెవ్వతో నీ పాతప్రియురాలనుకొని కొద్దిగా శంకపడ్డాను. అదీ తప్పేనా? నీనాలితనం కాకపోతే 'ఆమె' చెయ్యి పట్టుకొని ఆ ముసిముసి నవ్వులేమిటయ్యా? నీకంత 'చలి'గా వుంటే నీకోసం తహతహలాడే ఈ జవ్వనిని దగ్గరకు తీసికోరాదా? తన ప్రియునికి పాదాలు ఒత్తుతున్న వయ్యారి చిత్తరువుని చూచి నీవు అక్కడకూడా నీ పాదాలు ఒత్తిన ప్రియురాలిని మరువలేకున్నావేమోనని కొంచెం కాపుకాచాను. నీకిదేమి కొంటెతనమయ్యా? ఓ సోగ్గాడా వేదుక చాలించి ఈ బేలను గుచ్చి కౌగలించి నీ కళాప్రావీణ్యత జూపరాదా? అదిగో వింజామర వీచే దూతిక బొమ్మ తాళపు చెవులు పెట్టుకొనే ప్రతిమ అనుకోక బాలికనైన నేను కొంచెం అనుమానానికి లొంగిపోయింది నిజమే. ఓ శ్రీవేంకటనాథ! మన్మథకేళిలో నన్ను జయించితివి కదా! నన్నిందే నిలిపి మురిపించరాదా?

★ **కాయజకేళి** – రతిక్రీడ ★ **మానెవోనె** – చెక్కబొమ్మ



హరి సేవకే వేంకటేశమకుటం

సంఖ్య : 119 సంపుటము : 10 పుట: 69 రాగం : సాళంగనాట

**22** అందు కేమి దోసమా అయితే నేమి
కందువై లోకములోనఁ గలదే కాదా ॥పల్లవి॥

వలచి యిందిరాదేవి వన్నెలుఁ జక్కఁదనాలు
తలఁపులో నేపొద్దూఁ దలపోయఁగా
సలిగెతోడుత నాపె సారూప్య మందినట్టు
నలు వై గోవిందుఁడే నారాయణి యాయను ॥అందు॥

బాలకి యై లకిమమ్మ పై పై శిగ్గువడఁగా
తేలించి యాపె మనసు తెలియఁ బూని
చాలా వేదుక నాకె సకియె యుండినటు
ఆలికిఁ గా భువనమోహనరూప యాయను ॥అందు॥

యెదయ కింతులలో మే లెల్లాఁ దెలియఁ బూని
కడఁగి యాఁడురూపము గైకొని చూచి
బడినె తనకు నెందూఁ బతిలేనివాఁడు గాన
కద గోవిందుఁడే శ్రీవెంకటనాథుఁ డాయను. ॥అందు॥ **119**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య శ్రీవేంకటేశ్వరుని చర్యలను సమర్ధిస్తూ, ఈ సంకీర్తన చెబుతున్నారు. అందులో యేమి దోషమున్నది. ఒకవేళ వున్నా తప్పేమిటి? ఈ విధానము లోకములోవున్నదే కదా! నేడేమన్నా క్రొత్తగా వచ్చిందా యేమి? ఈ వింత చూశారా? ఏవేళనైనా ఈ ఇందిరాదేవిని వలచి నిరంతరం ఆమె స్వామి వలపులోనే గడుపుటవలన నారాయణునితో సారూప్యభావమంది ఆమె నల్లగా మారి నారాయణి అయింది. మరియొక వింత చూశారా? బాలికయైన లక్ష్మమ్మ తెచ్చిపెట్టుకొన్న సిగ్గుతో మౌనంగా వుంటే, ఆమె మనసు తెలియాలని వేదుకతో ఆమె చెలికత్తె రూపు ధరించాడు. మరీ అబ్బురమేమంటే, చెలికత్తెయే భువనమోహనరూపముతోనున్నది. లక్ష్మి సౌందర్యమును మించిన అందగత్తె అనిపించింది. సరె! యెలాగూ ఇంత జరిగింది కదా! అసలీ ఇంతులలో వున్న మేలు యేమియో చూచెదనని తానూ స్త్రీయైనాడు, కానీ సాటిలేని శ్రీవేంకటేశ్వరుని అందం తనకు మరే రూపంలోనూ లభించదని తెలిసి చిలిపి గోవిందుడు, శ్రీవేంకటేశునిగా స్థిరపడుటకే నిశ్చయించుకొని తిరిగి శ్రీవేంకటేశ్వరునిగా మారిపోయాడు.

★ **పతిలేని** – సాటిలేని ★ **లకిమమ్మ** – లక్ష్మీదేవి

సంఖ్య : 118   సంపుటము : 10   పుట: 68   రాగం : రామక్రియ

**23** **చెప్పకురే వానిసుద్ది చెలులాల**
**వొప్పులు సేసిన తనవోజలు మానీనా** ॥పల్లవి॥

**తా నేవూరు నే నేవూరు తల మనవే చాలు**
**మానరాని వావు లేల మాకుఁ జెప్పీని**
**మోనాన నూరకుండరే మొన్నటివాఁడు గాఁడా**
**వూని గరివడ్డగింజ వుడుకఁ బొయ్యీనా** ॥చెప్ప॥

**యెక్కడి కెక్కడిపొందు లేలా మొక్కులు మొక్కి**
**దక్కినట్టి బాసలెల్లఁ దలపించీని**
**తక్కరించె నిన్నటి తగవరి తానె కాఁడా**
**మక్కువైనా చిలుక మానీనా గుణము** ॥చెప్ప॥

**యెంత కెంత మందెమేళ మిట్టె సంగడి నుండి**
**కాంతుఁడు న న్నేమిటికిఁ గాఁగిలించీనె**
**వింత లేక నన్నును శ్రీవెంకటనాథుఁడు గూడె**
**యెంత సేసినాఁ జక్కెర యేల తీపు మానును.** ॥చెప్ప॥**11**

**భావ పరిమళం :**

దేవి అసహనంతో తన చెలికత్తెలకేమి చెబుతున్నదో, చినతిరుమలయ్య అద్భుతంగా పాడుతున్నారు. నాకు ఆయన కథను చెప్పకండే నేను వానికి యెంత మంచి చేసినా, అతని స్వభాం మారుతుందా? నా పిచ్చిగాని ఇన్నేళ్ళు వచ్చిన వానిలో మార్పెలా వస్తుందె? అయినా, నిజంగా చూస్తే తానెవరు? నేనెవరు? మానుకోలేని తన సంబంధాలు, ఇవ్వాళ పొమ్మంటే పోతాయా? అతని మనవే వివరమంతా చెబుతోంది. మీకెందుకే, మౌనంగా వుండండి. ఆయన పాతవాడే. ఆ బుద్ధీ పాతదే, కదా! పెద్ద వడ్లగింజ యెంతశ్రమ పడినా వుడుకుతుందా? ఎక్కడెక్కడో పొందులు పెట్టుకోవటం దేనికి ఇప్పుడు తనకేమీ తెలీదని మొక్కులు మొక్కటం దేనికి? గడచిపోయిన బాసలన్నీ గుర్తు చేసి ప్రయోజనమేమిటి? నిన్నటిదాకా టక్కరివాడు నేటికి నేడు న్యాయనిర్ణేత అంటే, ఏం జరుగుతుందె? మక్కువతో పెంచుకొన్న చిలుక కూడా తన పాత బుద్ధి మానక మునుపటి మాటలే మాట్లాడదా. ఎంతెంత వేళాకోళములాడుతాడే!! మొహమాటం లేకుండా, ఈ కాంతుడు గుచ్చి కౌగలించుకొంటాడు. ఏమాత్రం కొత్త బెరుకు లేకుండా, ఈ శ్రీవేంకటేశ్వరుడు నన్ను కూడుతూ మురిపిస్తాడే. ఏమి చేసినా చక్కెర తియ్యదనం మానుకొంటుందా. ఈ తిరుమల నాయకుడు అంతేనే.

★ **ఓజ** – స్వభావము ★ **మందెమేళము** – వేళాకోళము





సంఖ్య : 100   సంపుటము : 10   పుట: 58   రాగం : వర్మతాళం–బౌళి

**24** **ఇంక నేలా నాతోడ యింత సేయ**
**అంకెకాఁడ వౌర శేషాద్రినాథా** ॥పల్లవి॥

**చల్ల లమ్మేవారి కేల చందనము**
**చెల్లు నీవె పూసుకోరా చిన్నవాఁడ**
**కల్లరి వై నాతో నేల గయ్యాళించ**
**మల్లాడ నీ వదినెనో మరఁదలనో** ॥ఇంక॥

**జట్టిగా గొల్లెతల కేల చంద్రగావి**
**గట్టి గాఁగా నీవె దట్టి గట్టుకోరా**
**గట్టువాయతనమునఁ గదిసి నన్ను**
**పట్టేవు నీ చుట్టమనో పక్కమనో** ॥ఇంక॥

**మందలోనివారి కేల మల్లెలు**
**ముందు నీవె కొప్పులోన ముడుచుకోరా**
**అంది శ్రీవెంకటనాథ అవురా నన్ను**
**అందముగాఁ గూడితివి ఆల నటరా.** ॥ఇంక॥ **10**

**భావ పరిమళం :**

చిన తిరుమలయ్య చెప్పిన ఈ శృంగార కీర్తనలో గొల్లభామ నాయిక. శేషశైలనాథా! ఇంకా నాతో ఇంతసేయనేల? అని అంటున్నది. ఓ చిన్నవాడా! నాకు నీవు చందనము పూస్తున్నావు. కాని చల్లలమ్మేదానికి ఆ పూతలు చెల్లవుగానీ, నీవే పూసుకోరాదుటయ్యా! అబద్ధాలకోరువై నాతో యెందుకు దురుసుగా వుంటావు. నాతో సరసాలాడటానికి నేనేమన్నా నీ వదినా లేక మరదలినా? నీకూ నాకూ యేమి సంబంధం వున్నది? మేము గొల్లెతలము. మాకు చంద్రునివలె తెల్లగా చలువచేసిన వస్త్రములు యెందుకురా? నీవే గట్టిగా నీ ఒంటికి చుట్టుకోరాదా? గట్టువాయతనముతో (గయ్యాళితనముతో) నన్ను పట్టుకొంటున్నావు, నేనేమి నీ చుట్టాన్నా? పక్కాన్నా? మేము గొల్లపల్లెలో వుండే గొల్లవారము. మాకు మల్లెపూలెందుకురా? అంత పెద్దకొప్పు వుంది నీకు. నీ తలలోనే ముడుచుకోరాదా? ఔరా! వేంకటనాథా! యెంత అందముగా నన్ను కూడినావురా? నేనేమన్నా నీ ఆలినటరా?

★ **కల్లరి** – అబద్ధాలకోరు ★ **జట్టిగా** – సాటిగా

సంఖ్య : 115   సంపుటము : 10   పుట: 66   రాగం : శంకరాభరణం

**25 ఒగ్గాలివాఁడు గదె వోయమ్మా**
**సిగ్గున నా కగపడె చిలుకచందమునా ॥పల్లవి॥**

**తలఁచుకొంటేఁ జాలు తా నాడ కేఁగునమ్మా**
**వొలసి కమ్మగట్టు పావురమువలే**
**నెలఁత మదిఁ బారితే నిదురే కానఁడమ్మా**
**చలపాదిరా తిరి(గె?)టి జక్కవచందమునా ॥ఒగ్గాలి॥**

**ముదిత యెలుఁగు వింటే మొక్కలాన వాలునమ్మా**
**బెదరని పెంపుడుఁ బికిలివలె**
**సుదతి వుండిన యింటిచుట్టూఁ దిరుగునమ్మా**
**చెదరని మతితోడ జీనువవలెను ॥ఒగ్గాలి॥**

**గోమున నో యనియంటే గొబ్బున నోయను నమ్మా**
**కోమలపు వసంతపు కోవిలరీతి**
**కామించి మమ్మును శ్రీవెంకటనాథుఁడు గూడె**
**రామలలోఁ బాయలేని రాయంచవలెను. ॥ఒగ్గాలి॥ 115**

**భావ పరిమళం :**

శృంగార కీర్తనల ఒరవడి తాతగారి నుంచి పుణికిపుచ్చుకొన్నాడు చినతిరుమలయ్య. మనబోటి వారికి నిఘంటువులు లేకపోతే అడుగు ముందుకు పడదు. ఒక వేళపడినా అది సరియైన దారి అని రూఢి కాదు. దేవి తన చెలికత్తెతో ఆయన నాకు కూడా లొంగని “ఒగ్గాలివాడా” యేమే? ఓయమ్మా! నా దగ్గర సిగ్గు బిడియములుగల చిలుక మాదిరిగానే వుంటాడు, కదే! లేఖవ్రాసి కమ్మకుగట్టిన పావురమువలె తలచుకొన్నవారి దగ్గరకు వెళ్ళి వాలిపోతాడు కదే! తన ప్రియురాలు తన మదిలో మెదిలితే పాపం... ఇతగాడికి నిదురే రాదమ్మా! పట్టుదలతో చక్రవాకపక్షి నీటి బిందువుల కోసం తత్తరపడ్డట్లు తత్తరపడగలడు కదమ్మా! తాను వలచిన ముదిత కంఠస్వరం వినబడితే చాలు, ఉత్సాహం రెట్టింపై వచ్చి వాలిపోతాడు. ఏమాత్రమూ చెదరని పికిలిపిట్ట వంటివాడేనమ్మా! ఇతగాడు. తన కలల సుదతి యే ఇంటనుంటే ఆ ఇంటిచుట్టూ యేమాత్రమూ చెదరని మతితో తచ్చాడుతుంటాడు. ఈ విషయంలో జీనువపక్షివంటి వాడంటే... నమ్ము. తన మనసు దోచిన కోమలి కాకలీస్వనంతో “కో” అంటే వంతపాడే వసంతకోకిలేనమ్మా ఈ రసికుడు. తానూ ‘కో’ యని దానితో శృతి కలుపుతాడు. రాజహంస, సుందరాంగుల సుద్దులు వింటూ ముచ్చటపడుతుంది. మాబోటి ‘స్వాధీనపతిక’ దొరికితే ఈ శ్రీవేంకటేశ్వరుడు కోరి మమ్ము కూడినాడే.

★ **ఒగ్గాలివాడు** – స్వాధీనుడు ★ **రాయంచ** – రాజహంస



హరి సేవకే వేంకటేశముకుటం

సంఖ్య : 110   సంపుటము : 10   పుట: 63   రాగం : దేవగాంధారి

**26 చల్లని చూపులవాని చక్కనివాని ।పీలి।**
**చొల్లెపుఁ జుట్లవానిఁ జూపరమ్మ చెలులు ॥పల్లవి॥**

**వాడలోని చెలులను వలపించి వచ్చెనే ।వాడు।**
**చేడెల మనసు దొంగ చిన్నికృష్ణుఁడు**
**యేడుగడయునుఁ దానై యెలయించె నన్నును ।వానిఁ।**
**జూడక వుండఁగ లేను చూపరమ్మ చెలులు ॥చల్లని॥**

**మందలోని గొల్లెతల మరిగించి వచ్చెనే ।వాడు।**
**సందడిపెండ్లికొడుకు జాణకృష్ణుఁడు**
**ముందు వెనకా నలమి మోహింపించె నన్నును ।వాని।**
**పొందులు మానఁగ లేను పోనీకురే చెలు(లు?) ॥చల్లని॥**

**ఇంటింటి యింతుల నెల్లా యెలయించి వచ్చెనే ।వాడు।**
**దంటవాఁడు కవి(లి?)కిచేఁతలకృష్ణుఁడు**
**నంటునను శ్రీవెంకటనాథుఁడై నన్నుఁ గూడెనే ।వాని।**
**వొంటిఁ బాయలే నావద్ద నుంచరమ్మ చెలులు. ॥చల్లని॥ 110**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో గోపిక తన చెలులను అభ్యర్థిస్తున్నది. అతగాడు చల్లని చూపులవాడు. పచ్చబడి జడలు కట్టిన జుట్టువున్న బహుచక్కనివాడు. అతగానిని దెచ్చి మాకు జూపరమ్మా! మీకు పుణ్యం వుంటుంది. వాడు మా రేపల్లెలో గొల్లెతలను వలపించి చల్లగా జారుకొన్నాడే. ఈ చిన్నికృష్ణుడు చేడెల (వనితల) మనస్సులను దోచుకున్నాడే. ఏడు విధములైన రక్షకుడు వాడేయై, నన్ను అలరించాడే. ఏమి చేయగలదాననే? వానిని జూడక నేనుండలేనే. ఎంత అలసటగానున్నాడే? మందలోని (గొల్లపల్లెలోని) గొల్లెతలమే వోయమ్మా! వాడు మమ్మల్ని మరిగించి వచ్చినాడే నేడు తనకు నచ్చిన జవ్వని నెవ్వతెనో మనువాడుతున్నాడే, ఈ జాణకృష్ణుడు. నన్ను ముందు వెనుక నలిపి మోహపరవశురాలిని చేశాడే. వాడిని మరెక్కడికీ పోనీకురే వోయమా! నేను వాడి పొందును మానలేనే. ఇంటింటికీ తిరిగి ఆ ఇంటి యింతులనెల్లా పరవశురాండ్రను చేసివచ్చాడే ఈ దిట్టమైన మగాడు. ఈ అందగాని చేతలు కూడా బహు అందముగా వున్నాయి. స్నేహముతో నన్ను వేంకటనాథుడై, కూడినాడే. వానివద్ద ఒంటరిగా, నన్ను వదలకుండుడు. మీరు నావద్దనే వుండరమ్మా!

★ **నంటునను** – స్నేహముతో ★ **మందలోని** – గొల్లపల్లెలోని

సంఖ్య : 111 సంపుటము : 10 పుట: 64 రాగం : పాడి

**27 బలుఁ దటవే సాదటవే వీఁడు పల్లదీఁడు గాక**
**కోలముందై తనమాఁటలే గెలువ గొబ్బనఁ దగవు చెప్పీనమ్మా ॥పల్లవి॥**

**పసులఁ బేయలఁ గూరిచీనమ్మా పాలు నేయి నారగించీనమ్మా**
**పసిబిడ్డఁడంటా నెట్టు నమ్మవచ్చు బాలకృష్ణరాయని**
**కొసరి కన్నులు గీఁటీనమ్మా కొంగువ ట్టొయ్యనె తీసీనమ్మా**
**యిసుమంతలోనె కన్ను మొరఁగించి యిల్లిల్లు దప్పక తిరిగీనమ్మా ॥బాలు॥**

**నీరాటిరేవులఁ బొంచీనమ్మా నిక్కి నిక్కి తానె చూచీనమ్మా**
**వేరులేక యెట్టు దగ్గరుదుము గోవిందకృష్ణరాయని**
**ఆరడిలో నొడిదొడికీనమ్మా ఆనలువెట్టుచుఁ బోనీఁడమ్మా**
**వీరిడి మాయల నిందరినిఁ దాను వెంట వెంట నేల తిప్పీనమ్మా ॥బాలు॥**

**వొంటినె కాఁగిట నించీనమ్మా వొయ్యనె కళలు రేఁచీనమ్మా**
**నంటున మమ్మెల్లఁ గూడె శ్రీవెంకటనాథ కృష్ణరాయఁడు**
**జంటవలపులు చల్లీనమ్మా చలమున దక్కఁగొనె నోయమ్మా**
**బంటుగా నేలి అందరి మన్నించి పరిణామమునను న్నాఁడమ్మా. ॥బాలు॥**

**భావ పరిమళం :**

ఈ శ్రీకృష్ణరసామృతంలో చినతిరుమలయ్య తానూ ఒక గోపికయై యేమంటున్నారో వినండి. ఓయమ్మా! ఈ పల్లదీడు (దుష్టుడు) బాలుడటవే? వీడు సాధువా? మునుముందుగానే తానేమాటలలో మమ్మల్ని చిత్తుచేసి పైగా తగవులు తీరుస్తాడటమ్మా! పేయలను ఆవులను కలిపి అమ్ముకోటానికి, పాలు లేకుండా చేస్తాడమ్మా! మేము దాచుకొన్న పాలు నెయ్యి తానే ఆరగించేస్తాడు. వీడిని పసిబిడ్డ అని నమ్మమంటావా? ఏమివిడ్డూరము!! మరల మరల మాకు కన్నుగీటుతూనే వుంటాడు. కొంగువూడదీస్తాడు. క్షణంలో ఇల్లిల్లూ తిరిగివస్తాడు. మేము నీలాటిరేవులో స్నానం చేస్తుంటే, పొంచివుండి నిక్కినిక్కి చూస్తాడమ్మా! మీది మీదికి వచ్చి దగ్గరౌతాడమ్మా! నన్ను యేవేవో ఒట్లు పెట్టి కదలనీడమ్మా! ఏమి చెప్పమన్నావు బేలలైన స్త్రీలను యేమిమాయ చేస్తాడోగాని తనవెంట వెంటే తిప్పుకొంటాడమ్మా! ఒంటరిగా దొరికామంటేచాలు గట్టిగా కౌగలించి మర్మాంగములను స్పృశిస్తాడు. ఒకటిరెండు అని లేక మూకగా కూడినాడమ్మా! యీ వేంకట కృష్ణరాయడు. ఎన్నో జంటయై వలపులు గుప్పించి మత్సరముతో స్వాధీనపరచుకొంటాడమ్మా! కానీ అతని వారమైన మమ్ము మన్నించి సంతోషంగానున్నాడమ్మా!

★ **పరిణామమునవున్నాడు** – సంతోషించుచున్నాడు
★ **నీరాటిరేవులో** – స్నానంచేసే చోట





సంఖ్య : 113 సంపుటము : 10 పుట: 65 రాగం : సాళంగనాట

**28 జాజరవలపు జాణఁడే**
**వోజ దప్పఁడుగా నోయమ్మా ॥పల్లవి॥**

**వూని పిలువఁగ నొల్లక పోయిన**
**మేనవాఁడ ననీ మేలే**
**మానలేక పోయి మళ్లి వస్తి నని**
**ఆనవెట్టీఁ జవు లవునటే ॥జాజర॥**

**పట్టి పెనఁగఁ బరాకు సేసిన**
**చుట్టమ ననీఁ జూడరే**
**నెట్టన నాఁటికి నేఁడు వస్తి నని**
**దిట్టమాఁట లాడీఁ దెలిసెనా ॥జాజర॥**

**చెయివట్టినాఁ జేరరాకుంటే నా**
**ప్రియుఁ డనీఁ బ్రేమతో**
**కయికొని శ్రీవెంకటనాథుఁ డిట్టె**
**పయి పయి నన్నుఁ బాలించెనే. ॥జాజర॥ 113**

**భావ పరిమళం :**

చిన తిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో నాయిక తన చెలియతో నేమంటున్నదో ఆలకించండి. ఈ రమణుడు వసంతములాడేవేళ వలపించుటలో ఆరితేరిన నేర్పరి. ఓయమ్మా! వీడు తన స్వభావం యెంతకీ మార్చుకొనడే. ఒప్పుకొని పిలువనంపితే, అంగీకరించకపోయినవాడు మళ్ళీ మేనరికం మనది. నిన్ను మానలేను. మళ్ళీ వస్తానని ఒట్టేసి చెబుతాడు. అతగాడికి ఇదేమన్నా రుచించే వ్యవహారమవునటే? నేను చనువు తీసికొని పట్టి పెనవేసికొంటే పరాకు చిత్తగిస్తాడు. ఇవ్వాళ తాను నా చుట్టమునని అంటాడు చూడండే. అవశ్యం ఆనాడు నేటి దినమునకు వస్తానని దిట్టముగా మాటలు చెప్పాడే. తెలిసింది కదటే వోయమా! నా చెయ్యిపట్టుకొంటే... నేను రాను పొమ్మంటే... తాను నా ప్రియుడనని ప్రేమతో నా చెయ్యి పట్టుకొని శ్రీవేంకటేశ్వరుడై నన్ను ఆపైన ప్రేమగా పాలించినాడే, వోయమ్మా!

★ **దిట్టుమాటలాడి** – చాతుర్యంతో మాట్లాడి
★ **జాజరవలపు** – వసంతములాడేవేళ చూపే వలపు
★ **ఓజదప్పుడు** – స్వభావము మార్చుకోడు

సంఖ్య : 99 సంపుటము : 10 పుట: 57 రాగం : సామంతం

**29** ఇచ్చకమె సేసే వేరా నీవు
యెచ్చోటి చనవరి వేరా నీవు ॥పల్లవి॥

మన్నించి నన్ను నిట్టె మరఁదల రమ్మనేవు
యెన్నటి మేనవాఁడ వేరా నీవు
వెన్నుఁడ నన్ను నిట్టె విడెము దె మ్మనేవు
యెన్ని దాఁచఁ బెట్టితివి యేరా నీవు ॥ఇచ్చ॥

మెప్పించి నాతోడ మేలము లాడేవు
యెప్పటి నేస్తకాఁడ వేరా నీవు
దుప్పటికొంగు నాపైఁ దొడిఁబడఁ గప్పేవు
యిప్పు డెన్నటిపొందు యేరా నీవు ॥ఇచ్చ॥

కానిరా నను నిట్టె కాఁగిలించుకొనేవు
యేనాటి చుట్టమవు యేరా నీవు
కానిపించి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యేనెలవున నేలితి వేరా నీవూ. ॥ఇచ్చ॥ **99**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో నాయిక స్వామితో చనువుగా యేమంటున్నదో వినండి. ఏరా! నీవు కేవలం ముఖప్రీతి మాటలు చెబుతున్నావు. ఎక్కడి చనువు కాడవురా నీవు? నీకు సంకోచమనేదే లేదా, యేమిరా? అబ్బో! నన్ను యెంతో మన్నించి మరదలా రావే అంటున్నావు. మనది యెన్నటి మేనరికమో, చెప్పనేలేదు. ఎంత తేలికగా నన్ను నీకు తాంబూలమందించమంటున్నావురా!!! నాదగ్గర నీవు యెన్ని తాంబూలములు దాచిపెట్టమని ఇచ్చావురా? నన్ను మెప్పించటానికి పరాచికములాడుతున్నావా? నీవు నాకు యెప్పటి నేస్తగాడివిరా? అవ్వ!!! పైటకొంగు నాపై కప్పుతావా? నీవు నాకు యెప్పటి పొందుకాడవురా? కానీలేరా! యేమి నీ అగడము? నన్ను ఇట్టే కౌగలించుకొనుచున్నావు. నీవు నాకు యేనాటి చుట్టానివిరా? ఓ శ్రీవేంకటనాథా! నిన్ను ఇన్ని అనరానిమాటలు అనినా, యేరా పోరా అనినా, నా కనులకు కనుపించి నన్ను కూడితివి. నీవూ నన్ను యే తావున యేలితివిరా?

★ **దుప్పటికొంగు** – పైట చెంగు ★ **ఇచ్చకము** – ముఖప్రీతి కొరకు మాటలు





సంఖ్య : 98 సంపుటము : 10 పుట: 56 రాగం : సాళంగనాట

**30** ఔనయ్యా మేలెరిఁగిన ఆణికాఁడవు
తానక మైన నీ దొరతనమెల్లాఁ గంటిమి ॥పల్లవి॥

జక్కఁదన మెరఁగనిజాణవా నీ వేమైనా
తక్కరి వై గుజ్జుదానిఁ దగిలితివి
యెక్కువగా నాముందర యెవ్వరినో యెంచఁగాను
చక్కఁగా నా మదిలోన చల్లఁ గాక వుండునా ॥ఔన॥

కన్నెపాయ మెరఁగని ఘనుఁడవా నీ వేమి
పిన్న వై రేవతిదేవిఁ బెండ్లాడితివి
యెన్నికె నాముందర నీ యింతులజవ్వన మెంచె(చి?)
తన్నిటా నామదిలోన నానందించ కుందునా ॥ఔన॥

యిట్టె వినయము నీ వెరఁగవా నీ రొమ్ము
మెట్టినయింతికె కడు మేలువాఁడవు
చిట్టకము లెంచేటి శ్రీవెంకటనాథ నన్ను
గటి (ట్టి)గాఁ గూడితివి నేఁ గరఁగక వుందునా. ॥ఔన॥ **98**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య ఈ శృంగార కీర్తనలో నాయిక రూపం ధరించి తిరుమలగిరి రాయనితో యేమంటున్నారో ఆకర్ణించండి. ఔనయ్యా ఒప్పుకొంటాను. నీవు మేలు చేయుటనెరిగిన ఆప్తబంధుడవే. మేమెక్కడ చూచినా సుస్థిరమైన నీ యేలుబడే కంటిమి. నిన్ను యెదిరించగల మొనగాడే లేడు. నీవు జాణవేగాని, చక్కదనమెరగనివాడవా? మరి, ఆనాడు మధురలో టక్కరివై మరుగుజ్జుదైన కుబ్జని తగులుకొని యెంత రసికత చూపించావు!!! నాముందే నువ్వు మరెవ్వతనో చూచి యెక్కువగా పొగిడితే నా మనస్సులో చక్కగా చల్లగా వుంటుందా? ఒళ్ళుమండదూ? పాపం, తమరు కన్నెప్రాయమంటే యేమిటో యెరుగని, ఘనులా? నిజమే అయ్యుంటుందిలే. తమరు బలరామమూర్తిగా అవతరించి వేదకాలమునాటి రోహిణీదేవిని, చిన్నవాడివైనా పెండ్లియాడినారటకదా! ఆమె ఆ యుగం నాటిది కావున నీ కంటే యెక్కువ పొడుగుంటే నాగలితో సరిచేశావట. నా ముందరే నేడు, శ్రీనివాసుడవై నీ ఇంతులను యెంత జవ్వనులని మెచ్చుకొంటావా? తమరి చేతలు తలచుకొని నా మనస్సులో ఆనందించక, యెలా వుంటాను? తమరు కాంతలముందు, వినయము చూపక నిక్కచ్చిగా, వుంటారా!!! మరి తమరి వురముపై తిష్టవేసికొని కూచుందే... మా అమ్మ అలమేల్మంగ, మరి ఆమెకెలా మేలువాడవైనావు? ఏది యేమైనా శ్రీవేంకటేశ్వరా! నన్నూ కూడి కరిగించినావు. ఈ జన్మకిది చాలు, ప్రభూ!

★ **ఆణికాడు** – ఆప్తబంధువు ★ **తానకపు** – సుస్థిరమైన

సంఖ్య : 109 సంపుటము : 10 పుట: 63 రాగం : నాదరామక్రియ

**31 ఇన్నాళ్లు దా యేడ నుండెనమ్మ**
**వన్నెగాఁ గొసరవచ్చీ నేఁడు** ||పల్లవి||

**వేఁకపువిరహాన వేఁగ లేక నేను**
**సోఁకఁగ నెదురు చూడఁగా**
**తాఁకి తలఁచఁడు తరుణులఁ గూడి**
**యేఁకట నిపుడు నే నిత వైతినా** ||ఇన్నాళ్లు||

**కడు నొంటిఁబొద్దు గడపఁగ లేక**
**వొడికపుటాసల నుండఁగా**
**తడవఁడు నన్ను దనయిచ్చలనే**
**అదరి యిప్పుడు నాపై ఆస వుట్టెనా** ||ఇన్నాళ్లు||

**గొప్పతమకానఁ గుందుచుండ లేక**
**అప్పుడె పిలువ నంపఁగా**
**కప్పి నన్ను శ్రీవెంకటనాథుఁడు గూడె**
**యిప్పుడు నారతు లింపు వుట్టెనా.** ||ఇన్నాళ్లు|| **109**

**భావ పరిమళం :**

చిన తిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో నాయిక యేమంటున్నదో వినండి. తాను (స్వామి) ఇన్నాళ్ళూ యెక్కడ వుండెనమ్మా? నేడు శోభలీనుతూ నన్ను అపేక్షించి వచ్చాడు. వేకపు (వెగటైన) విరహాన నేను వేగలేక నొచ్చుకుంటూ వానికోసం యెదురుచూస్తే అతగాడు తరుణులను గూడి నన్ను కనీసం తలవనుకూడా తలవడు. మిక్కిలి కోర్కెతో ఇప్పుడు అతగాడికి నేను కావలసి వచ్చానా? ఒకపూట కూడా గడుపలేక, ఒడికపు (ఒడిగట్టిన) ఆశలతో నేనుండగా తన కలలోనైనా నన్ను తలచడు. మరి ఇప్పుడు నాపై ఆశ పుట్టిందా యేమి? నేను గొప్పతమకాన (మోహముతో) నుండి కుందుచు (దుఃఖించుచూ) గడపలేకపోతుంటే, అతనికోసం అప్పుడే పిలువనంపితే తానే వేంకటనాథుడు గాన, నన్ను ఆక్రమించి కూడినాడు. అయినా చిన్న సంశయం వచ్చి అడుగుతున్నాను, ఆ స్వామికి ఇప్పుడు నా రతిలో ఇష్టము పుట్టిందా?

★ **అదరి** – అతిశయించి ★ **ఇంపుపుట్టెనా** – ఇష్టము కలిగిందా





సంఖ్య : 104 సంపుటము : 10 పుట: 90 రాగం : సామంతం

**32 మందుల మాయలఁ బోదె మంచివలపు**
**బొందితోఁ బతికాఁగిట భోగింపించుఁ గాని** ||పల్లవి||

**కారుచిచ్చయినాఁ దొలుకరివానచే నారు**
**ఆరదు పన్నీటిజడి నంగతాపము**
**ఆరదై నీటిచేత ననల మారకుండునా**
**సారెఁ జెలి కోరిక వెచ్చలు రేఁచెఁ గాక** ||మందుల||

**జడివానైనా వెలుచు సంగడి చలికాలాన**
**యెడయదు చలువల నింతి చెమట**
**నిడివిఁ బుప్పొడి చల్ల నీరు దియ్యకుండునా**
**కడుఁ జెలియ మనసు కరఁగించీఁ గాకా** ||మందుల||

**వేవేగ నాయిటివోతె విసరదు బెట్టుగాలి**
**పోవు నిట్టూర్పులు పతిఁ బొందినా నీవె**
**శ్రీవెంకటనాథుఁ గూడి చెల్లునటె వుసురన**
**భావజకేలిలోపలి పరిణత గాకా.** ||మందుల||

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య తానే దేవి ఆంతరంగికురాలై ఆమెకు విరహతాపము కలిగించే తిప్పలు వివరిస్తున్నారు. దేవీ! గాఢమైన నీ వలపు తాపము మందులవల్ల మాయలవల్ల పోదమ్మా! నీ తనువును వేంకటపతి కౌగిట భోగింపజేయి. అదిగాక మరియొక మార్గములేదమ్మా! నామాటను నమ్ము. అయినా నేనొక హితవు చెబుతాను, ఆలకించు. ఎంతపెద్ద కారుచిచ్చయినా, తొలకరి వాన పడితే ఆరిపోతుంది. కానీ, శరీరతాపము పన్నీటి జల్లుతో స్నానం చేసినా, ఆరుతుందా? సమృద్ధిగా నీరువుంటే యెంత మంటయైనా ఆరిపోతుంది. చెలిమదిలో రేగిన కొర్కెల మంటలు ఆరిపోతాయా? అంతదాకా యెందుకు సంగమించుటకు అనువైన చలి కాలములో యెంత పెద్ద జడివానైనా వెలుచుట సహజవమే, కానీ, యెంత చలువజేసినా యీ యింతి చెమటలు ఆరిపోతాయా? భారీగా పుప్పొడి చల్లితే యెంత చల్లనైన నీరుకూడా తియ్యకుండా వుంటుందా? అదేవిధంగా రమణుని ఆగమనము చెలి మనస్సును కరగించకుండునా? అతి వేగముగా ఆవిరైపోయే గ్రీష్మంలో గట్టిగా గాలి కూడా వీచదు. కానీ ఓ చెలీ! నీ నిట్టూర్పులు మాత్రం నీ పతి పొందుతోగానీ పోవు. శ్రీ వేంకటేశుని వూరకనే కూడితే నీ నిట్టూర్పులు పోవు. నీవు మన్మథకేళిలో పరిణతి బొందితేనే అది సాధ్యము.

★ **భావజకేళి** – రతిలీల ★ **ఆయిటివోతే** – ఆవిరైపోయే

సంఖ్య : 141 సంపుటము : 10 పుట: 65 రాగం : పాడి

**33 వేళావేళలు లేవా వినోదములకై నాను**
**యేలా తమకించి వస్తే యిది నీవెఱఁగవా ॥పల్లవి॥**

**అయ్యో సారె నన్ను నలయించే వేరా**
**వొయ్యారపువాఁడ యింత కోపుదునా**
**చయ్యాటాన జాజిమొగసానఁ బట్టే వేరా**
**నెయ్యపు నాతలఁ పిది నీ వెఱఁగవా ॥వేళా॥**

**యిటె(ట్టె?) మాఁటిమాఁటికి యేఁచే విదేమిరా**
**పట్టిన నీ చలాన నేఁ బడఁగలనా**
**వుట్టిపడి చిగురాకు వుక్కఁ వెట్టే వేరా**
**నెట్టన నా వల పిది నీ వెఱఁగవా ॥వేళా॥**

**చాలాఁ దరితీపుల సటలు సేసే వేరా**
**బాలకి నింతే నిన్నుఁ బాయఁ గలనా**
**మేలిమి దామెరలోఁ దుమ్మిద గూడినటు నన్ను**
**యేలి ఎవెంకటనాథ యిది నీ వెఱఁగవా. ॥వేళా॥ 114**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ సరస శృంగార కీర్తనలో నాయిక, స్వామిని యెలా దెప్పుతున్నదో చిత్తగించండి. ఏమిరా, వినోదానికైనా నీకు వేళాపాళా లేవటరా! నన్ను ఇంత మోహపరవశనుజేస్తే, యేమవుతుందో నీవెరగవా? అయ్యా! ప్రతిసారి నాకింత అలసటనెందుకు కలిగిస్తావురా? పరాచికాలాడితే మొగసాలకెక్కి రట్టుచేస్తావా? స్నేహశీలినైన నా తలపు ఇట్టిది అని నీవెరుగవా? మరి యెందుకు నన్ను మోహపరుస్తున్నావురా? నామీద మాటిమాటికీ ఇంత అతిశయం చూపిస్తావేమిరా? పట్టిన నీ పట్టుదలను నేను భరించగలనా? చిగురాకు వంటి నన్ను ఉక్కు సంకెలల బిగించేవేమిరా? నీ యెట్టెదురుననే వున్న నా వలపు నీవెరగవా? ఎంతో మోసకారివలె నన్నెరగనట్లే వుపేక్షిస్తావేమిరా? నేను బాలను, బేలను. నిన్ను విడచి వుండగలనా? మేలైన తామరపూవులోనికి తుమ్మెద చొచ్చి మకరందము నాస్వాదించినట్లు, ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను కూడి యేలినావు. ఇది నీవెరగవా?

★ **తరితీపులసటలు** – ఉపేక్షించువంచన ★ **వేళావేళలు** – వేళాపాళా





సంఖ్య : 103 సంపుటము : 10 పుట: 59 రాగం : బౌళి

**34 అటువంటివారికి నీ వప్పుడే వలతువు**
**అటు నిటు నిన్నుఁ బాలార్చీనా యేమి ॥పల్లవి॥**

**గట్టున మొగలిరేకు కొమ్మ పయ్యదపై వేయఁ**
**బుట్టచెండు వుచ్చుకొని పొలిఁతి వేసె**
**అట్టె నీ చేఁతకుఁ జేఁత ఆపె సేసె నావలెనె**
**దట్టించక నీపై దయ దలఁచీనా యేమి ॥అటు॥**

**మెత్తని తామెరపువ్వు మెలుఁతపై నీవు వేయ**
**బొత్తుగాఁ బాదపుటందెఁ బొలిఁతి వేసె**
**మత్తిలి యాపె మారుకు మారు సేసె నావలెనె**
**బత్తి సేసి ని న్నూరకె పాటించీనా యేమి ॥అటు॥**

**యించుక దగ్గరి నీ వేకతము చెప్పఁ బోతే**
**లంచముగా నీకుఁ దమ్ములము వెట్టెను**
**నించి శ్రీవెంకటనాథ నిన్నుఁ గూడె నావలెనె**
**మంచితనమునఁ గూడి మన్నించీనా యేమి. ॥అటు॥**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య తానూ శ్రీవారి ప్రేమికయై స్వామి వారి ఇతర వలపుకత్తెలను గురించి యెలా దెప్పుతున్నారో చూడండి. స్వామీ! నీకు అటువంటి వారైతే... కమ్మగా బాగుంటుంది. వారిని అప్పటికప్పుడే ప్రేమించేస్తావు. అటుచేసి ఇటుచేసి "అది" నిన్ను తృణీకరించిందాయేమి? పాపం! అంత దిగాలుపడ్డావు. తమరు రహస్యంగా, మొగలిరేకును ఆమె పయ్యెదకు తగిలేట్లు విసిరారు. ఆ పొలతి (జవరాలు) తన పూల బుట్టలోనున్న దండలన్నీ నీపై విసరివేసింది. నీ చేష్ట సహించి, అది నావలె వూరకుంటుందనుకొన్నావా? నిన్ను అదలించి వేసింది. నావలె దయదలచిందా? లేదుకదా! మెత్తని తామరపువ్వును, తమరు ఇంకొక మెలుత (వయ్యారి)పై వేశావు. ఆ పొలతి (జవ్వని) తనుకూడా తన పాదపు అందియను వూడపీకి నీపై విసిరివేసింది. ఆ మదించిన తరుణి నీకు బాగానే బదులిచ్చింది. నాలాగ భక్తితో నిన్ను వూరకే మన్నిస్తుందనుకొన్నావే యేమి? పాపం! ఇదిగో ఈ నీ మూడవ ప్రియురాలు, పాపం! నావలెనె నీవు చెప్పిన కతలను నమ్మి లంచముగా నీకు తాంబూలపు తమ్మ కూడా పెట్టింది. ఇక అది నిన్నెట్లా వదలగలదు? ఓ వేంకటేశా! నావలెనే నిన్ను కూడినది. ఆవిడైనా నిన్ను నావలెనె మన్నించునా యేమి?

★ **పాలార్చీనా** – తృణీకరించెనా ★ **దట్టించక** – అదలించక

సంఖ్య : 102 సంపుటము : 10 పుట: 59 రాగం:రామక్రియ–ఆటతాళం

**35 తలఁపుఁ దలఁపు లెస్స తగు లాయను**
**కలకంటి యిందుకె నిక్కము వలచెనయ్యా ॥పల్లవి॥**

**యేనుగపై నీవు రాఁగా యింతి పయ్యద జారఁగ**
**పూని మిద్దెమీఁద నుండి పొసఁగఁ జూచె**
**ఆని కరికుంభములు అంకుశాన నీ వూఁదిన**
**కానుక నీ చేఁతలకుఁ గడు వలచెనయ్యా ॥తలఁపు॥**

**నీవు గుఱ్ఱముఁ దోలఁగ నెలఁత చిక్కు దీయుచు**
**తావుల మేడపై నుండి తప్పక చూచె**
**కావించి నీ సమకట్లలో నల్ల జల్లి**
**దూవిన నేరుపుల కెదురు వలచెనయ్యా ॥తలఁపు॥**

**తేరుపై నీవెక్కి రాఁగా తెఱవ మై పులకించి**
**చేరువ వుప్పరిగెపైఁ జెలఁగి చూచె**
**గారవించి వచ్చి శ్రీవెంకటనాథ నీవు గూడ**
**తారుకాణ చేఁతలకుఁ దగ వలచెనయ్యా. ॥తలఁపు॥ 102**

**భావ పరిమళం :**

చినతిరుమలయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో పద్మావతీదేవి శ్రీనివాసుని యెందుకు వలచిందో వివరిస్తున్నారు. ఈ కలకంఠి తలచిన కొలది శ్రీనివాసుడివైన నీపై అధికమైన అనురాగబద్ధయైనది. అందుకే నిజమైన వలపుకు లోనైపోయినదయ్యా! ఆనాడు నీవు ఏనుగుపైనెక్కి నీవురాగా, తొట్రుబాటుతో ఇంతి పైటకొంగు జారిపోయినది. మరియొకసారి నిన్ను చూడాలని ఆమె మిద్దెపైనుండి చూచినది. కరికుంభముల మీద నీవు అంకుశంతో పొడుస్తుంటే బలిష్టమైన నీ చేతలకు ఆమె నిన్ను మిక్కిలి వలచినదయ్యా! ఇంకొకనాడు నీవు గుఱ్ఱముపై వచ్చావు. ఆ నెలత తన జుట్టు చిక్కుదీస్తూ మేడపై నుండి నిన్ను చూచినది. వేటాడుటకు బోవుచున్న నీ వేష రచనను చూచి, నల్లని కుచ్చును దువ్విన నీ నేర్పుకు ముగ్ధురాలై ఆమె నిన్ను వలచినదయ్యా! తొలిచూపులో ప్రేమలో పడినవారికి మూడవచూపు పెండ్లిపీటలకు దారితీయకబోవుట సాధ్యమా? నీవు రథమెక్కి రయమున నేగుచు ఆమెకు కనుపించావు. ఆ తెఱవ (వనిత) శరీరమంతా పులకించింది. వేగముగా సౌధంపైకెక్కి ఉత్సాహంతో నిన్నుచూచినదయ్యా! ఆమె ఆహ్వానం మన్నించి శ్రీవేంకటనాథుడవైన నీవు ఆమెను కూడితివి. నిదర్శనములైన ఇట్టి పనులకే ఆమె నిన్ను వలచినదయ్యా!

★ **సమకట్లలో** – వేషరచనలో ★ **జల్లి** – కుచ్చు





★ **తారుకాణిచేతలకు** – నిదర్శనమైన పనులకు

సంఖ్య : 179 సంపుటము : 29 పుట: 120 రాగం : పాడి

**36 నిన్నుఁ బాయఁగలఁడటే నిమిషమైన నీతఁడు**
**వున్నతి నీ కతలనే వోలలాడు నీతఁడు ॥పల్లవి॥**

**తాపపు విరహమేలే తలవంచుకొననేలే**
**నీపై బత్తిఁగలఁడు నీమగఁడు**
**మాపు దాఁకా చింతలేలే మమ్ము నింతడుగనేలే**
**యేపొద్దు నీ గుణములే యెంచుకొను నీతఁడు ॥నిన్ను॥**

**లేకలు వా (వ్రా?) యించనేలే లేమల నంపఁగనేలే**
**వాకిటికి నింతలోనే వచ్చె నీతఁడు**
**జోకతో సగినాలేలే చూచి తమకించనేలే**
**నీకుఁగానే యాకారు నిచ్చ నిచ్చా నీతఁడు ॥నిన్ను॥**

**చెక్కిటిచే యిఁకనేలే సిగ్గులు వడఁగనేలే**
**ఇక్కడ శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును**
**మొక్కులు మొక్కఁగనేలే ముసిముసినవ్వులేలే**
**మక్కువ నీ రతులే మరిగినాఁ డీతఁడు ॥నిన్ను॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన సరసశృంగార కీర్తనాఝురిలో అనేక పర్యాయాలు వోలలాడాము. కాని తాత మనవళ్ళు ఒకే దైవం కొండలరాయుడనీ, ఆ స్వామి సరస శృంగార ప్రియుడని నమ్మి కవితలు చెప్పటం మాత్రం అరుదే. రెండుతరాల అంతరాలను గమనించండి. ఈ కీర్తనలో అన్నమయ్య, దేవి చెలికత్తెయై దేవికి నివేదిస్తున్నారు. ఓ దేవీ! అతగాడు నిన్ను వదలి నిముసమైనా వుండగలడటే? నీ ముచ్చట్లనే వింటూ, కనబడినవారికి అవే కతలుగా చెబుతూ, వాటిలోనే వోలలాడుతున్నాడమ్మా! నీవు కూడా తాపము కలిగించే విరహానికి తలవంచుతావేమమ్మా? నీ మగనికి నీపై యెంతో మన్ననా, భక్తి వున్నాయమ్మా! చీకటి పడేదాకా నీకీ చింతయేలనమ్మా! మాటిమాటికి అతని వూసే అడుగుతావు. ఇంత ఆరాటం తగునా? ఇతడు కూడా అన్నివేళలా నీ గుణగణములనే తలచుచున్నాడు. అతగానికి యెన్నిలేఖలను వ్రాస్తావమ్మా. యెంతమంది చెలులను రమ్మని పిలువనంపుతావమ్మా? ఇంతలోనే నీ వాకిట్లోకే వచ్చాడుగా అతగాడు. ఈ దశలో శుభ శకునాల కోసం చూచి తత్తరపడటం దేనికమ్మా? అతగాడూ ప్రతినిత్యమూ నీకోసమే పిలువనంపుతున్నాడమ్మా! చెక్కిట చేయిజేర్చి ఇంకా సిగ్గుపడనేలనమ్మా? ఇక్కడికే వచ్చి శ్రీవేంకటేశుడు నిన్నేలినాడు. ఇంకా మొక్కుకోవటం దేనికమ్మా? ముసిముసినవ్వులు కూడా వద్దు. మక్కువతో నీ సురతమున ఇతగానిని లాలించవమ్మా!

★ **జోకతో** – బాగుగా ★ **ఆకారు** – పిలువనంపుతున్నాడు

సంఖ్య : 138 సంపుటము : 29 పుట: 92 రాగం : ఆహిరినాట

**37** నన్నెంత లాలించేవు నగుతా నీవు
మన్నించుమనఁగలనా మరుగఁగలఁగాక ॥పల్లవి॥

నేరుపుతో మాఁటలాడి నిన్ను మెప్పించఁగలనా
చేరి నీతోడ బలిమి సేయఁగలనా
సారెకు నిన్ను గద్దించి సరసమాడఁగలనా
మూరెఁడు గొప్పు వంచుక మొక్కఁగలగాక ॥నన్నెం॥

చాయల సన్నల నిన్ను సాదించఁగలనా
నాయములు వచరించి నవ్వఁగలనా
ఆయాలు సోఁకఁ బెనఁగి అలయించఁగలనా
నాయంత నేనుండి నిన్ను నమ్మగలగాక ॥నన్నెం॥

కచ్చుపెట్టి నీమతి గరఁగించగలనా
మెచ్చి నీవు వేఁడుకోఁగా మీరఁగలనా
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కొచ్చి యింకా నీపొందే కోరఁగలఁగాక ॥నన్నెం॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామిని వలచిన భక్తురాలై పారవశ్యంతో యేమి విన్నవించుకొంటున్నారో ఆలకించండి. ప్రభూ! నన్నెంత లాలించెదవయ్యా!!! నవ్వులొలికే నీవు నాకెంత మన్ననినిస్తున్నావయ్యా! నేనేమీ నిన్ను శాశించలేను. కేవలం తాపంతో ఆవేదన చెందగలను గాక! నేను జాణను కానయ్యా! నేర్పుతో మాట్లాడలేను. పోనీ, నిన్ను బలవంతమూ చేయలేను. పోనీ గర్వంతో సరసమాడే తాహతూ లేదు. నా మూరెడు కొప్పున్న తలవంచి, నీకు మొక్కగలనుగాక! ప్రభూ! నీవు చేసిన జాడలు, గుర్తులు చూపి నిన్ను సాధించగలనా? నీకే న్యాయమెలా చేయాలో చెప్పి ఒప్పించగలనా? నీ గోప్యములనంటి పెనగి నిన్ను అలరించగలనా? నేను సిగ్గరిని. పోనీ నిన్ను నాయంత నేనే నమ్మాలంటే కొంచెము జంకుగానే వుందికాని నమ్మక తప్పదు. ప్రభూ! పగబూని నీతో పంతంతో నీ మనస్సును కరిగించగలనా? నిన్ను మెచ్చుకొని సరదాగానైనా సాధించలనా? అట్టి నన్ను ఓ శ్రీవేంకటేశా! యేలుకొనినావు. ఎప్పటికీ నీ పొందే కోరగలిగెదను గాక!

★ **కచ్చుపెట్టి** – పగబూని ★ **చాయలసన్నల** – జాడలు గుర్తులు





సంఖ్య : 41 సంపుటము : 29 పుట: 28 రాగం : సాళంగం

**38** తప్పక చూడవయ్యా తలయెత్తి యీకె దిక్కు
వొప్పు లన్నియును నీ యువిదకే కలిగె ॥పల్లవి॥

చక్కని చందమామ సతిమోము
చిక్కని తేటవెన్నెల చిరునవ్వు
జక్కవల సొబగులు చన్నులు
అక్కజపు సింగారము లతివకే కలిగె ॥తప్పక॥

గండుఁ దుమ్మిదల పిండు కలికి కొప్పు
పండుఁ బగడపు జోక పసనిమోవి
మెండైన నిగ్గుటద్దాల మించు జెక్కులు
దండిగల యందము లీ తరుణికిఁ గలిగె ॥తప్పక॥

గొప్ప తమ్మిరేకు లీ కొమ్మ కన్నులు
చెప్పరానిచిగురు లీ చిన్నిపాదాలు
యిప్పు డిట్టె శ్రీవేంకటేశ నిన్ను రతిఁగూడె
మెప్పించె నీవింత లలమేల్మంగకే కలిగె ॥తప్పక॥

**భావ పరిమళం :**

అన్నమయ్య స్వామిని ప్రోత్సహిస్తున్నారు. ప్రభూ! కొంచెం నీతలయెత్తి ఈ అలమేల్మంగను తప్పక చూడవయ్యా! ఈమె కలిములరాణి. సృష్టిలోని ఒప్పులన్నీ, నీ భామకే వున్నవయ్యా! ఈ సతి వదనమున్నదే అది చందమామను బోలియున్నది. ఈమె చిరునవ్వు తెల్లని వెన్నెలవలె స్వచ్ఛమైనది. ఇక ఈమె కుచద్వయము చక్రవాక పక్షులజంట. ఆశ్చర్యకరమైన సింగారములన్నీ ఈ అతివకే కలవయ్యా! ఓ శ్రీనివాసా! ఈ కలికి కొప్పువున్నదే, అది గండు తుమ్మెదల గుంపు. తాంబూలశ్రవణముచే పండి యెఱుపెక్కిన ఈమె అధరము పగడమువలెనున్నది. ఈమె చెక్కిళ్ళ తళతళలు చూచినావా? అవి నిగ్గుదేలిన అద్దములవలె మెఱయుచున్నవి. గొప్ప అందములన్నీ ఈ తరుణి స్వంతమయ్యా! తిరుమలనాథా! ఈ కోమలి కన్నులు మేలైన పద్మ దళములంటే నమ్ము. ఈమె పాదములు లేత చిగురుటాకులు. ఓ వేంకటేశ్వరా! ఈ అందాలభరిణ ఇప్పుడిటు నిన్ను గూడి రతికేళిలో నిన్నే మెప్పించిందంటే ఇంతటి అలమేల్మంగ నీకే కలిగెనయ్యా!

★ **పిండు** – గుంపు ★ **దండిగల** – గొప్ప

సంఖ్య : 41 సంపుటము : 29 పుట: 28 రాగం : నాదరామక్రియ

**39** **ఇంకా నేమి గావలెనే యిన్నిటా సంతోసించితి**
**వుంకువ లిచ్చి యేరీతి నొడఁబరచీనే** ॥**పల్లవి**॥

**వింటిఁగదవే తన వేడుకైన సుద్దులెల్లా**
**కంటిఁగదే తనరూపు కనుఁగొనల**
**అంటిఁగదవే తొల్లె యన్నిటా తా జాణఁడని**
**వొంటినుండి మరియేల వొడఁబరచీనే** ॥**ఇంకా**॥

**చొక్కితిఁగదవే తనసురతపు వేడుకల**
**మొక్కితిఁగదవే తనకు ముందే చేతుల**
**నిక్కితిఁగదే తాను నేరిపిన చేఁతల**
**వొక్కమాఁటే నన్ను నెంత వొడఁబరచీనే** ॥**ఇంకా**॥

**నమ్మితిఁగదవే యిట్టె నయముల వాస(సు?)ల**
**కమ్మితిఁగదవే తను కాఁగిటిలోన**
**యెమ్మెల శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను**
**వుమ్మడిఁ దానిప్పుడేల వొడఁబరచీనే** ॥**ఇంకా**॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరసశృంగార కీర్తనలో దేవి తన చెలికత్తెతో యేమంటున్నదో ఆలకించండి. ఇంకా యేమి గావలెనే? అన్ని విధములా సంతోసించితిని. ఎన్నో శుల్కములనిచ్చి నన్ను యేరీతిగా లొంగదీసుకున్నాడో, చూడవే. తాను వేడుక నాకు చెప్పే వూసులన్నీ విన్నాను కదే! నా కనుకొలుకులలోనుంచి తన రూపమును చూచితిని కదే! నేను మొదటే చెప్పాను కదే! అతగాడు అన్నిటిలో జాణడని. అదేమిటోగాని నేను ఒంటరిగా చిక్కానంటే చాలు, కైవశం చేసికొంటాడే. ఓ చెలీ! తన సురతపు వేడుకలలో పరవశింపజేసినాడు కదే! అతని ప్రావీణ్యమునకు మెచ్చికొనినాను కదలే! నేర్పుతో కూడిన ఆతని చేతలకు గర్వించినాను కదవే! ఒక్కసారిగా నన్ను తనకు ఒడబడునట్లు చేసికొనినాడు కదటే! ఓ చెలీ! నామగని నెమ్మది స్వభావాన్ని, ఔన్నత్యాన్ని సులువుగా నమ్మినాను కదవే! తన కౌగిటిలో కమ్ముకొంటిని కదవే! అతగాడు విలాసపురుషుడైన శ్రీవేంకటేశ్వరుడు. నేను అలమేల్మంగను. ఇది జగద్విదితమే. మరి ఇప్పుడు ఉమ్మడి రతులకు తాను ఇప్పుడే వొడబరచయత్నించుచున్నాడే?

★ **చొక్కితి** – పరవశించితిని ★ **వాసులు** – ఔన్నత్యములు.





సంఖ్య : 43 సంపుటము : 29 పుట: 29 రాగం : ముఖారి

**40** **అది యెవ్వతె తాను అలమేల్మంగను నేను**
**పొదిగి దాఁచకువే నీపూనిక మెచ్చేఁగాని** ॥**పల్లవి**॥

**పొలఁతి నీ కెవ్వతె బుద్దులు చెప్పినది**
**నలువున నాపతితో నవ్వుమంటాను**
**తెలుపఁగదవే దాని దీమస మెంతో**
**చలములు నీతో మరి సాదించేఁగాని** ॥**అది**॥

**నీ కెవ్వతె యీ చేఁతలు నేరిపినది**
**జోకతో నా రమణుని సొలయుమని**
**నాకుఁ జూపవే దాని విన్నాణ మెంతో**
**మైకొని నీతో మరి మాఁటలాడేఁగాని** ॥**అది**॥

**వోడక యెవ్వతె నీకీ వుపదేశ మిచ్చినది**
**యీడనా శ్రీవేంకటేశు నెనయుమని**
**వాడలోనెంచవే దాని వాసి యం(యెం)తో యీతడు**
**కూడె నన్ను నీతో మరి గుట్టు చెప్పేఁ గాని.** ॥**అది**॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార సంకీర్తనలో రోషావేశపరవశురాలైన దేవి, తన చెలికత్తెతో యెంత దురుసుగా పలుకులములుకులను ప్రయోగిస్తున్నదో చూడండి. నేను అలమేల్మంగను. కోరిన నాస్వామి హృదయ వాసినిని. మరి అది యెవ్వతే? నీవు స్వామి రహస్యాలను దాచేదిట్టవని నాకు ముందే తెలియును. నీ శ్రద్ధకు, ప్రయత్నానికీ మెచ్చానుగానీ తాను యెవ్వరో దాచకుండా చెప్పవే. ఇది నా ఆన. ఓ పొలతీ! నీకెవ్వతె బుద్ధులు నూరిపోస్తున్నదే? నా పతితో నవ్వుతూ వూసులాడమని దానికెవరు చెప్పారే? దాని దీమసము (ధైర్యం) యేమిటో అంతుచిక్కుటలేదే? నా పట్టుదల నీకుతెలుసుగా. నేను అదెవరో సాధించే తీరుతాను. ఏమే, యీ చేష్టలన్నీ నీకెవ్వతె నేర్పుతున్నదే? నా రమణుని బాగుగా పరవశింపజేయమని దానికెవరు బోధిస్తున్నారే? దాని నేర్పరితనమెంతో వివరించవే. నిన్ను ( నా చెలికత్తెను) లొంగదీసుకొని మాట్లాడుతున్నదే, దాని సంగతేమిటి? ఓ చెలీ! వెనుదీయక యెవ్వతె నీకివన్నీ ఉపదేశిస్తోందే? ఇక్కడ... నా తిరుమలలో... నా శ్రీవేంకటేశ్వరుని సంగమించమని యెవరు నూరిపోస్తున్నారే? వాడలో దానికేమి పేరు, పరపతి వుంటాయే? నీవీ గుట్టు చెప్పేలోగానే, ఈతడే నన్ను కూడినాడే.

★ **పూనిక** – ప్రయత్నం ★ **జోకతో** – బాగుగా

సంఖ్య : 178   సంపుటము : 29   పుట: 119   రాగం : ఆహిరి

**41** **చెలియ నా విన్నపాలు చిత్తానఁ బెట్టుమనవే**
**మలసి న న్నేకాలమూ మన్నించుమనవే** ॥పల్లవి॥

**యిచ్చక మాడుదుఁగాని యేమిటా వెంగెములాడ**
**కొచ్చి కొసరుదుఁగాని కోపగించను**
**పచ్చిగా నవ్వుదుఁగాని పంతములు నెరపను**
**తచ్చి తచ్చి నా గుణాలు తా నెరుఁగుననవే** ॥చెలియ॥

**వాడిక చూపుదుఁగాని వాసి వంతు లెంచను**
**వేడుకలు వెంతుఁగాని వేసారను**
**వూడిగాలు సేతుఁగాని వుదుటున జంకించను**
**యీడు జోడైన నా బత్తి యెంచి చూడుమనవే** ॥చెలియ॥

**చేరికాఁగిలింతుఁగాని సిగ్గులు మరఁగుసేయ**
**గారవింతుఁ గాని మరి గయ్యాళించను**
**యీరీతి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను**
**తారుకాణగా నన్నేలె తలఁచుకొమ్మనవే** ॥చెలియ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై దేవి ఆవేదననాలకిస్తున్నారు. దేవి యేమంటున్నదంటే... చెలియా నీవు స్వామిని చూచి నా మాటగా చెప్పవే. నా విన్నపమును చిత్తమున బెట్టమనవే. నా గురించి అతగాడికి తెలియదా? నేను సరస సంభాషణ చేస్తానుగాని వ్యంగ్యంగా మాట్లాడను. కొద్దిగా కసురుకొంటాను గాని కోపగించను. అప్పుడప్పుడూ పకపక నవ్వుదునుగాని పంతముతో సాధించను. ఇన్నాళ్ళూ నిశితముగా నన్ను చూచాడు కనుక నాగుణగణములు తానెఱుగుననవే. చెలియా! నాకున్న చనువుకొద్దీ వాడిక చూపుతాను, కానీ నా వాసి వంతూ చూపి అహంకరించను. వేడుకగా వుంటాను కాని, చింతిస్తూ వుండను. చేతనైనంత సేవచేస్తానుగాని, అతిశయంతో బెదరించను. నేనాతనికి ఈడూజోడైనదాననే కాదు, ఆతనిపై నా భక్తిని కూడా యెంచి చూడమనవే. చెలియా! అతని సందిటజేరి కౌగలింతును సిగ్గులతో మరగుగా నుండును. అతనిపై యెనలేని గౌరవం చూపుతానుకాని గయ్యాళినికాను. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ రీతిగా నేనలమేల్మంగను. నన్ను తార్కాణముగా నెంచమనవే.

★ **వేసారను** – చింతిస్తూ వుండను ★ **మలసి** – ఉత్సహించి





సంఖ్య : 44   సంపుటము : 29   పుట: 30   రాగం : వరాళి

**42** **ఎఱఁగ మిన్నాళ్ళు మీ యిద్దరి సరితెలును**
**గుఱుతాయ నేఁడు మాకు గుట్టెల్లాఁ దెలిసెను** ॥పల్లవి॥

**మెచ్చి మెచ్చి నీతోను మేలమాడీ సారె సారె**
**మచ్చి నీ కీపె మేనమామ కూఁతురా**
**రచ్చలోన నిన్నుఁ గడు రాకొట్టి పిలువవచ్చీ**
**పచ్చిగా నీకెప్పుడూను పాయరాని చుట్టమా** ॥ఎఱఁగ॥

**చేరి చేరి బుద్ధులెల్లాఁ జెప్పవచ్చీ నీకును**
**కోరి పెండ్లాడినయట్టి కొలము నాల**
**కూరిమితో నీవద్దఁ గూచుండి నవ్వులు నవ్వీ**
**నేరుపుతోఁ దగులైన నేస్తపు జవరాలా** ॥ఎఱఁగ॥

**పొంచి పొంచి మోవి తేనె పొత్తు గలసీ నీతో**
**వంచనతోఁ దా నీకు వాడిక కాంతా**
**యెంచఁగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను**
**కొంచక నన్నేలితివి కొమ్మ వేడుకకత్తే** ॥ఎఱఁగ॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామి దేవేరియై స్వామితో యేమంటున్నారో చిత్తగించండి. ప్రభూ! మేము ఇన్నాళ్లు గడిచిన మీ ఇద్దరి సరితెలను (చరిత్రలను) యెఱుగము. ఈ రోజు తెలిసింది. మీ గుట్టెల్లా యెఱిగితిమి. దేవా! యీమె నీకేమన్నా మేనమామ కూతురా ఇంతగా ఆటపట్టిస్తున్నావు. జన సందోహంలో కూడా నిన్ను "రా" కొట్టి పిలుస్తూనే వున్నది. ఇంతకీ నీకామె అంత పాయరాని చుట్టమా? అవునుగాని నీకు మరీ చేరువైనదా? అంతగా నీకు బుద్ధులు నేర్పుతున్నది? కోరి పెండ్లాడినట్టి కులసతియా? నవ్వుతూ నీచెంత కూర్చొనియున్నది? ఈ నేస్తురాలైన జవరాలు నీకు నేర్పుతో అన్యోన్యమైనదా? మీ ఇద్దరూ ఒకరిని విడిచి ఇంకొకరుండలేరా? ఓ రమణుడా! వుండివుండి, నీమోవితేనె నాశించే పొత్తు గలసినదీమే నీకు. నీవాడుకైన కాంతామణుల వలె వంచన పరురాలా? ఇట్టివారెందరున్న నాకేమి? నేను అలమేల్మంగను, నీవు శ్రీవేంకటేశ్వరుడవు. ఆ కొమ్ము వేడుకకత్తె అందుకే జంకక నీవు నన్నేలితివి ప్రభూ!

★ **పచ్చిగా** – బహిరంగంగా ★ **వాడికకాంత** – అలవాటైన భోగపు స్త్రీ

సంఖ్య : 177 సంపుటము : 29 పుట: 118 రాగం : కన్నడగౌళ

**43 తారుకాణ వచ్చెనా తలఁచుకో నామాఁట**
**గారాబు టలమేల్మంగ కాఁగిటిలోవాఁడవు ॥పల్లవి॥**

**సన్నల నే కొసరితి సరసము లాడితి**
**విన్నపాలెల్లాఁ జేసితి వేడుకొంటిని**
**తన్ను దూరరాదు నాకు దయగలవాఁడు తాను**
**యెన్నిటఁ గరఁగునే యిఁకఁ దనమనసు ॥తారు॥**

**చెలులచేఁ జెప్పించితి చేతులెత్తి మొక్కితి**
**తెలియఁజెప్పితి వావి తెరదీసితి**
**యెలమి నే వలచితి యింగిత మెఱుఁగు తాను**
**మలసి తా నెప్పుడిఁక మన్నించీనే నన్నును ॥తారు॥**

**నగితిఁ దనతో నేను నమ్మిక లిప్పించుకొంటి**
**తగిలి కాఁగిలించితి తమిరేఁచితి**
**జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు తాను**
**తగవుతో నన్ను నేలె తా నిఁక నేమనీనే ॥తారు॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగారకీర్తనలో దేవి తన చెలికత్తెతో చెబుతున్నది. ఓ చెలియా! నేను చెప్పెడి మాటలన్నీ నిదర్శనాలౌతాయే. అతనితో నేనాడో చెప్పాను "నీవు మురిపెముల ముద్దుగుమ్మ అలమేల్మంగ చేతిలోనివాడవు" అని. ఆ మాటే నిజమైనది. ఓ చెలీ! సంజ్ఞల ద్వారా అతనిపై ఆపేక్ష చూపినాను. సరసము లాడినాను, విన్నపములను చేసినాను, వేడుకొన్నాను. నాకు అతగాడిని నిందించుటకు కూడా తెలియదు. తాను దయామయుడు. మరి తన మనస్సు కూడా కఠినమై పోయినది. అది యేమి చేస్తే కరుగుతుందే. ఓ సఖీ! నా అంతరంగిక చెలికత్తెలతో చెప్పించాను. చేతులెత్తి మొక్కినాను, అతను నాకెట్లా వరుసైనవాడో చెప్పించాను. నా తెరచాటును కూడ తొలగించినాను. నేను అతనిని వలచితిని. తాను కూడా ఇంగిత జ్ఞానమున్నవాడే. మరి ఇక అతగాడు నన్నెప్పుడు మన్నించునే? చెలియా! అతనితో కలిసి నవ్వుకొన్నాను. అతనితో నమ్మించుకొన్నాను. తమకమురేగునటుల అతనిని కౌగలించితిని. తాను శ్రీవేంకటేశ్వరుడు నేను అలమేలుమంగను. నన్ను యెంతో తగవుతోడి (న్యాయంతో) ఏలునుగాని వదలడు. నన్నేలెడివాడు ఇక యేమనగలడే.

★ **ఇంగితము** – యుక్తాయుక్త విచక్షణ ★ **తెరదీసితి** – తెరచాటుతీశాను





సంఖ్య : 137 సంపుటము : 29 పుట: 92 రాగం : బౌళి

**44 ఆతఁ డేమి సేసినాను అంతా నంత వలపే**
**కాతరించక మొక్కవే కమ్మర నీ విపుడు ॥పల్లవి॥**

**దగ్గరఁ గూచుండి ని న్నాతఁడు వేఁడుకొనఁగాను**
**సిగ్గులు వడకువే చెలియా**
**వెగ్గళించి నిమ్మపంట వేసె నందరిలోనంటా**
**యెగ్గులుగాఁ బట్టకువే యెదిరించి ఇపుడు ॥ఆతడే॥**

**వుమ్మగిలు రతులకు నొడివట్టి పెనఁగఁగా**
**బొమ్మల జంకించకువే పొలఁతీ**
**కమ్మటి నీ కుచములు కదుఁబిసికెనంటాను**
**కుమ్మెలువో నూఁదకువే కొనగోర నిపుడు ॥ఆతడే॥**

**శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కాఁగిలించుకోఁగా**
**మోవి గంటిసేయకువే ముదితా**
**కైవసమై నీ మనసు కరఁగించె నితఁడంటా**
**వేవేలుగా దూరకువే వేడుకతో నిపుడు ॥ఆతడే॥**

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ సరస శృంగార కీర్తనలో దేవికి చెలికత్తెవలె సలహాలనిస్తున్నారు. దేవీ! అతగాడేమి చేసినా అంతా వలపేనమ్మా! నీవు అనవసరంగా భయపడి తత్తరపడక, ఆయనకు నీ మనస్ఫూర్తిగా మొక్కవమ్మా! ఓ చెలియా అతడు నీ దగ్గర కూర్చొని నిన్ను వేడుకొంటే సిగ్గులు పడవద్దు. అందరిదారిలో పోక నీ మగడు వెగ్గళించి నిమ్మపంట వేశాడని (ఉపకారానికి అపకారం చేశాడని) తప్పుపట్టకువే. అతనినెదిరించి మాట్లాడకే. ఓ పొలతీ! రతికేళి రసకందాయములోనుండగా, పెనగులాడకువే. నీ కనుబొమ్మలను ముడిచి బెదిరించకువే. నీ కుచగిరులనొత్తినాడని, నలియ గట్టినాడని వూదకువే కొనగోర (కొనగోట గిచ్చవద్దు). ఓ ముదితా! శ్రీవేంకటేశ్వరుడు నిన్ను చేరి సందిట జేర్చగా ఆయన అధరక్షతమునకు సాహసించకుము. నిన్ను కైవశము చేసికొని నీ మనసు కరగించినాడని వేడుకతో గూడ నిందించకువే. ఆయన కేవలం నీ మగడనుకొంటున్నావా ఆయన జగన్నాథుడే.

★ **ఉమ్మగిలు** – ఉక్కబోసే ★ **కాతరించి** – తత్తరపడి

సంఖ్య : 170   సంపుటము : 29   పుట: 114   రాగం : ముఖారి

**45** **ఇన్ని గురుతులు నీతో నీకె విన్నవించుమనె**
**వున్న దిదె తెరలోన నొద్దికాయఁ బనులు** ॥పల్లవి॥

**వనితతో నీ వేమో వావులు చెప్పితివట**
**చెనకుతా నేమేమో సేసితివట**
**వొనరఁగ నీ వేలివుంగర మిచ్చితివట**
**యెనసెఁ జుట్టరికము లింటికి రమ్మనెను** ॥ఇన్ని॥

**సముఖాన నుండఁగానే సన్నలు సేసితివట**
**చెమటలు కొనగోరఁ జిమ్మితివట**
**తమకించి కుచములు తప్పక చూచితివట**
**అమరు నన్నిటా సమ్మతాయను రమ్మనెను** ॥ఇన్ని॥

**వేడుకతోఁ జెలులచే వీడె మిప్పించితివట**
**జోడుగాఁ బెనఁగులాడి చొక్కితివట**
**యీడకు వచ్చి శ్రీవేంకటేశ యలమేల్మంగను**
**కూడితివట దినము గొంకక రమ్మనెను** ॥ఇన్ని॥

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో స్వామి చెలికత్తెయై స్వామి పొందుకోరుతున్న కొం(గొత్త ప్రియురాలి గురించి వివరిస్తున్నారు. స్వామీ! “ఈవిడగారు” ఇన్ని గురుతులు నీ గురించి వివరించిందయ్యా! అవన్నీ, నీకు వివరించమన్నది. ఆమె తెరలోన వుండియే పనులను అనుకూలం చేసికొన్నది. స్వామీ! నీవామెను కలిసినప్పుడు నీవే, మీవావి వరుసలనామెకు వివరించావట. ఆమెను తాకుతూ యేమేమో చేసినావట. నీ గుర్తుగా నీవేలి వుంగరము ఆమె వేలికి పెట్టావట. సరే! ఇంకేమి? చుట్టరికం కలిసింది కదా! ఇంటికి రమ్మనమని పట్టుబట్టుతున్నదయ్యా! స్వామీ! నిండు సభలోనే ఆమెకేసి చూసి సైగలు చేసినావట. నీ చెమటలను కొనగోటితో తీసి ఆమెపై జిమ్మినావట. ఆమె కుచద్వయముపై తన్మయపు చూపులు బరపినావట. తనకు సమ్మతమేననీ, అన్నీ అమరుతాయి రమ్మని ఆహ్వానం పంపినదయ్యా! స్వామీ! నీవు మిక్కిలి వేడుకతో! నీ చెలులద్వారా, ఆమెకు ఆహ్వాన తాంబూలం పంపినావట. ఆమెకు జతగా పెనగులాడితివట, పరవశించితివట. ఇంత జరిగాక, ఇక్కడకు వచ్చి ఓ శ్రీవేంకటేశ్వరా యేమీ తెలియనివానివలె దేవి అలమేల్మంగ సరసకు జేరి కూడితివట. చివరిగా... రేపు కూడా పొద్దు గ్రుంకక ముందే రమ్మన్నదయ్యా!

★ **ఒద్దికాయబనులు** – పనులు అనుకూలం చేసికొనినది
★ **సముఖాననుండగ** – అందరి యెదురుగానే





సంఖ్య : 140   సంపుటము : 29   పుట: 94   రాగం : ముఖారి

**46** **చిన్నదాననంటా నీవు సిగ్గువడేవే**
**చన్నులను (నొ?)రసి మోవి చవిచూపఁగదవే** ॥పల్లవి॥

**చేరి చూడఁగఁజూడఁగా చీఁకటి వెలుగందురు**
**పేరఁబెట్టితే పాలే పెరుగందురు**
**కోరి కాచుకుండితే చిగురులే చేగలందురు**
**వోరుపుతో నాతని వూడిగాలే సేయవే** ॥చిన్న॥

**మరుఁగగా మరుఁగగా మచ్చికవుట్టు నందురు**
**పెరిగితే పూఁపలే పిందె లందురు**
**నెరులు గూడఁగా గూడఁగా నిండుఁగొప్పాయనందురు**
**సరసము లాతనితో సారె సారె నాడవే** ॥చిన్న॥

**మఱి చెప్పఁగాఁజెప్పఁగా మాఁటలే కత లందురు**
**తఱచు పొందుసేసితే తగు లందురు**
**చిఱునవ్వులతో నిన్ను శ్రీవేంకటేశుఁడు గూడె**
**మెఱసి పెక్కురతుల మెప్పించవే** ॥చిన్న॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ సరస శృంగార సంకీర్తనలో ఆయన దేవి ఆంతరంగిక నెచ్చెలియై కొత్త పెండ్లి కూతురుకు బిడియము సహజమేననీ, పోనుపోనూ పతితో సమరతి అనుభవం ‘చిన్నదానిని’ శృంగార నాయికను చేస్తుందని నచ్చచెబుతున్నది. ఓ దేవీ! చిన్నదాననంట సిగ్గుపడుతున్నావు. ఇది నీకు తగదమ్మా! కొంత చిలిపితనం వుండాలి. ఒక్కసారి నీ పతిని, నీ గుబ్బలతో నొత్తి మధుర అధరసుధ నందించి చూడవమ్మా! మొదట, పతిమనసు వోపికతో సేవచేసి కరిగించాలి. ఎందుకంటే చూడగా చూడగా చీకటి కూడా వెలుగులో వలె, మనకు అలవాటవుతుంది. తోడుబెడితే పాలే పెరుగువలె మారిపోతుంది. ప్రీతితో కాచుకొనివుంటే లేత చిగురు కొమ్మలే ముదురు శాఖ అవుతుంది. నీ అంకిత భావమే నిన్ను హృదయాధి దేవతను చేస్తుంది. దేవీ! నీవు అవకాశం చిక్కినప్పుడెల్లా అతనితో సరసములాడవలెనమ్మా! స్వామిపై నీకు మచ్చిక పుట్టాలంటే, ముందు నీవు విరహంలో మరిగిపోవాలి. పెరిగితే పూవే పిందె అవుతుందని నీకు తెలియదా? ఎంత పెద్ద కొప్పు అయినా మొదట లేతచిరు వెంట్రుకలే సుమా! దేవీ! అంతదాకా యెందుకు మొట్టమొదట చిన్నమాటలతో మొదలైన సంభాషణలు కథలు చెప్పుకోవటం వరకు వస్తుంది. ఒకసారి తరచూ పొందుకు అలవాటు పడితే దానినే తగులంటారు. ఆ తగులము వల్లనే శ్రీవేంకటేశ్వరుడు చిరునవ్వులతో నిన్ను కూడినాడు. ఇక నీదే ఆలస్యం. స్వామిని పెక్కు రతులతో మెప్పించవే.

★ **మరుఁగగా** – వేదన జెందగా ★ **తగులము** – వదలలేని వలపు

సంఖ్య : 160 సంపుటము : 29 పుట: 107 రాగం : దేశాక్షి

**47 చెలి యన్నిటికి నీకుఁ జేతులెత్తి మొక్కీ నిదె**
**లలి నీపెఁ గాఁగిలించి లాలించవయ్యా** ||పల్లవి||

**అలసి సొలసి నిన్ను నంగనలు జంకింతురు**
**వలపులు పైఁజల్లి వంచుకొందురు**
**గిలిగింతరతులను కెరలి పైకొందురు**
**వులివచ్చి సరసాల వోరుచుకోవయ్యా** ||చెలి||

**కూరిమి గొసరి నిన్ను కొనగోర నూఁదుదురు**
**సారె సారెఁ బంతముతో సాదింతురు**
**దూరుదురు కేరుదురు తొడమీఁద నెక్కుదురు**
**వూరక వాడికబీరా లోరుచుకోవయ్యా** ||చెలి||

**కుమ్మెలుగాఁ గాఁగిలించి గుబ్బల నిన్నొత్తుదురు**
**కమ్ముకొని కెమ్మోవి గంటిసేతురు**
**నెమ్మది శ్రీవేంకటేశ నీ వీకెఁ గూడితివి**
**వుమ్మగిలుఁ జేఁత లివి వోరుచుకోవయ్యా** ||చెలి||

**భావ పరిమళం :**

అన్నమయ్య ఈ కీర్తనలో దేవి ఆంతరంగిక చెలికత్తెయై స్వామికి నచ్చజెబుతున్నారు. అయ్యా! నీవు అందగాడివి. నీతో శృంగారంలో కొద్దిగా శృతిమించితే, ఈ నీ నాయికలను నీవు తప్పించి యెవరు అర్ధం చేసికొంటారయ్యా? మా చెలి సాక్షాత్తు అలమేల్మంగ. నీపై ప్రేమాతిశయంతో కొద్దిగా చనువు తీసికొనినది. తన చేతలన్నిటికీ నేడు నీకు చేతులెత్తి మొక్కుచున్నది. మిక్కిలి అనురాగంతో ఈమెను కౌగలించి లాలించవయ్యా! కామాతిరేకంతో కామినులు యేమేమి చేయరు, చెప్పవయ్యా. అలసి సొలసిన అతివలు కోపంతో చిరచిరలాడి బెదిరిస్తారు. కొంతమంది వలపులు వెదజల్లి లొంగదీసికొంటారు. గిలిగింతలు పెట్టే రతికూటములలో విజృంభించి పైబడుదురు. కొంచెము “పచ్చితనము” నీవు భరించక తప్పదు. శృంగార నాయికల శ్రేణులు నీకు తెలియనివా స్వామీ! కొంతమంది మురిపెంగా కసురుకొని, కొనగోటితో గిచ్చుతారు, కొంతమంది పంతముతో ప్రతిదానికీ సాధిస్తుంటారు, కొడతారు. కొంతమంది తొడమీద నెక్కుదురు. కొంతమంది వూరకే గొప్పలు చెప్పుకొంటారు. అయినా ఇవన్నీ నీకు తెలియనివా స్వామీ! శ్రీనివాసా! చేడెలు కొందరు నొక్కుకొంటూ కౌగలించి గుబ్బలనొత్తెదరు. కొందరు పైబడి అధరాస్వాదన దంతక్షత పరిపూర్ణత చూపెదరు. ఏదియేమైనా ఓ శ్రీవేంకటేశ్వరా! నీవీమెను నెమ్మదిగా కూడితివి. ఈమె ఉక్కపోత చేతలను వోర్చుకోక తప్పదు స్వామీ!

★ **ఉమ్మగిల్లు** – ఉక్కపోత కలిగించు ★ **ఉలిపచ్చి** – నులివెచ్చని





సంఖ్య : 161 సంపుటము : 29 పుట: 108 రాగం : నారాయణి

**48 ఇందాఁకా రతికేలికి నెదురులు చూచితివి**
**పొందు లొనగూడెఁగదె పూఁచినట్టు నీకు** ||పల్లవి||

**మంతనాన నాతనితో మాఁటలెల్లా నాడితివి**
**సంతోసమాయఁగదవే సకియ నీకు**
**చెంతనుండి చేతులారా సేవలెల్లాఁ జేసితివి**
**పంతములు చెల్లెఁగదె పడఁతులలోనను** ||ఇందా||

**తిలకిం చాతనితోడఁ దేరకొన నవ్వితివి**
**తలఁపు లీడేరెఁగదె తరుణి నీకు**
**వలపించి యిట్టె కైవసము సేసుకొంటివి**
**వెలసెఁగదవే నీవేడుక లన్నియును** ||ఇందా||

**రాఁపుగ శ్రీవేంకటేశురతులెల్లాఁ జేకొంటివి**
**కాఁపురము దక్కెఁగదె కలికి నీకు**
**యేపున నోలలాడితి వెనసి కాఁగిటిలోన**
**నీ పగటు మించెఁగదె నేఁ డితని యెదుట** ||ఇందా||

**భావ పరిమళం :**

అన్నమయ్య దేవి చెలికత్తెయై దేవితో యేమి చెబుతున్నారో వినండి. ఇప్పటిదాకా రతికేళికి యెదురు చూచితివి కదమ్మా! నీకు పూనిన విధముగానే నీ పతితో పొందులు కలిసినవి కదమ్మా! ఓ సఖియా! నీవు ఆతనితో మంతనాలాడితివి కదమ్మా! నీకు సంతోషము కలిగింది కదుటమ్మా! ఆయన గారికి దగ్గరవుండి నీ చేతులారా సేవలు చేశావు కదటే. నీ సాటి వనితల దగ్గర నీ పంతము చెల్లింది కదటమ్మా! ఆతనిని చూచి తేటపడి, నవ్వితివి. ఓ తరుణీ! నీవనుకొన్నట్లే జరిగింది కదటమ్మా! అతగానిని కైవసము సేసికొనుటకు, వలపించుకొంటివి. వేడుకలన్నీ వెలసినవి కదటమ్మా! రాపిడితో శ్రీవేంకటేశ్వరుని రతులెల్లా జేకొనినావు కదటే. ఓ కలికీ! నీ కాపురం చక్కబడినది కదమ్మా! సుస్థిరముగా ఆతని కౌగిటిలో వోలలాడితివి కదమ్మా! నేడు ఇతని యెదుట నీ లావణ్యము మించిపోయినదే.

★ **తేరకొన** – తేటపడి ★ **పూఁచి** – పూనిన విధముగా
★ **రాపుగ** – రాపిడితో ★ **పగటు** – లావణ్యము

సంఖ్య : 168   సంపుటము : 29   పుట: 112   రాగం : దేసాళం

**49** ఎన్నటి చుట్టరికమో యీపెకు నీకు
నన్ను నేలితి విపుడు నమ్మించి యిన్నిటాను ॥పల్లవి॥

చెనకి చెనకి నీతో చిరునవ్వు నవ్వుకొంటా
మనవు లెంత చెప్పీని మగువ
గునిసి గునిసి సిగ్గు కుప్పలు వోసుకొంటా
పెనఁగులాడె నప్పటి పెక్కుచందములను ॥ఎన్న॥

జరసి జరసి మోవి చవులు వుట్టించుకొంటా
మరగులేల పెట్టీని మాఁటలలోన
కరఁగి కరఁగి బత్తి కానుకలు వట్టుకొంటా
గురుతులెట్టు చూపీని గుబ్బలపై నీకు ॥ఎన్న॥

తగిలి తగిలి మొక్కి తమకము రేఁచుకొంటా
మొగమేమి చూపీ నీముందరనుండి
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశ యేలితి -
విగురుఁబోఁడి నీ కీపె యిల్లాలయి వున్నది ॥ఎన్న॥

**భావ పరిమళం :**

అన్నమయ్యకూడా, స్వామిని వలచిన వలపుకత్తె. కాని స్వామి క్షీరసాగరకన్య అలమేల్మంగ సొత్తు అని ఆ ప్రేయసికీ తెలుసు. అయినా ఆమె నిరాశపడుటలేదు. స్వామి కొందరివాడు కాదు, అందరివాడు. ఆమె యేమంటున్నదో వినండి. స్వామీ! యెన్నటి చుట్టరికమో నీకూ ఈమెకూ. ఇప్పుడు అన్నివిధములుగా నమ్మించి నన్నూ యేలినావు. ఇకనేమి అనగలనయ్యా ఈమె నిన్ను తాకి, తాకి ఆనాటి మీ చుట్టరికం చెప్పి చిరునవ్వుతో, తన మనవుల నన్నింటినీ యేకరువుపెట్టింది. గోముగా కులికి సిగ్గులు కుమ్మరిస్తూ అవసరమైతే నీతో పెనగులాడియైనా విరహంతోనైనా అనేక విధముల సాధించగలదు. మేమెక్కడ, ఆమె యెక్కడ? స్వామీ! నీ యెదురురొమ్మును ఆక్రమించి, అధరామృతములు చవిచూపించుకొంటూ మాటలతోనే నిన్ను మరగింపగల సమర్థురాలు. నీపై శ్రద్ధా భక్తులలో కరిగిపోతూ నీకు అనేక కానుకలనందించింది. నీవింకా కాదంటే తన గుబ్బలపై నీవు చేసిన గురుతులు చూపి మరీ నిన్ను లొంగ దీసుకొనగలదు. స్వామీ! ఆమె నీకు మ్రొక్కేటప్పుడూ తాకుతూ నీకు తన్మయత్వం పెంచుతుంది. నీ యెదురుగా వుండి తన ముద్దు మోము జూపి నిన్ను కరిగించగలదు. ఓ శ్రీవేంకటేశా! నీవీ అలమేల్మంగను శోభతో నేలితివి. చిగురువంటి కోమలమైన శరీరముగల ఈమె నీ ఇల్లాలు ప్రభూ!

★ **అప్పటి** – విరసముతో ★ **గునిసి** – కులికి



హరి సేవకే వేంకటేశమకుటం

సంఖ్య : 167   సంపుటము : 29   పుట: 112   రాగం : కాంబోది

**50** అట్టె నిన్నుఁ జూచి చూచి అరుదందేరు చెలులు
నెట్టన నీ యెమ్మెలెల్లా నెరపేవు నీవు ॥పల్లవి॥

మొక్కలపుఁ జేఁతలును మొసగస మాఁటలును
యెక్కడ నేరిచితివే యింతేసి నీవు
చెక్కునఁ బెట్టిన చేయి సెలవుల నవ్వులును
గక్కన నప్పటి నెందు గడియించుకొంటివే ॥అట్టె॥

నిడువాలుఁ జూపులును నిక్కుబొమ్మ జంకెనలు
గుడిగొన నెందు దెచ్చుకొంటివే నీవు
వెడజారఁబయ్యెదయు వీడియు వీడని కొప్పు
అడియాలా లన్నియును నమరెనే నీకు ॥అట్టె॥

వుప్పతిలు రాజసాలు వులివచ్చి సిగ్గులును
యిప్పు డెందుఁ జదివితి వింతేసి నీవు
అప్పుడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
నెప్పున న న్నేలె మరి నీ వెన్నటిదానవే ॥అట్టె॥

**భావ పరిమళం :**

అన్నమయ్య చెప్పిన ఈ శృంగార సంకీర్తనలో అలమేలుమంగమ్మ, స్వామి నెచ్చెలితో యేమంటున్నదంటే... నా చెలులు నీ విలాసమును నెరపుట జూచి అందరూ, "ఈమె అందము యేమి సొబగు" అని ఆశ్చర్యపడుచున్నారు. నీవు అంతేసి గుసగుసమాటలు, అతిశయపుచేతలు యెక్కడ నేర్చినావే? నీ చెక్కిలిపై చేయి జేర్చటం, మధురంగా నవ్వటం మళ్ళీ వెంటనే విరసముగానుండటం యెందు సంపాదించితివే? నీ దీరమైన వాలుచూపులు, నిక్కిన కనుబొమ్మలచే బెదరగొట్టుచూపులు, పోగేసినట్లు యెక్కడనుండి తెచ్చుకొంటివే? కొద్దిగా జారినా సవరించుకొని పైటను, వీడీవీడని కొప్పులను అలవోకగా సవరించుట నీకెట్లు అమరినవే? దృష్టినాకర్షించు నీ రాజసము, నులిపచ్చి సిగ్గులు పడటం, రెంటినీ ఇంతచేటు ప్రదర్శించుట యెక్కడ నేర్చితివే? నేనెవరినో తెలుసా? శ్రీవేంకటేశ్వరుని దేవేరియైన అలమేలుమంగను. ఆ స్వామి యెప్పుడూ నన్నే యేలుకొంటాడు. నీవెప్పటిదానవే?

★ **ఉప్పతిల్లు** – దృష్టినాకర్షించు ★ **మొసగసమాటలు** – గుసగుస మాటలు

★ **అడియాలము** – అలవోకగా ★ **మొక్కలపు** – అతిశయించిన

సంఖ్య : 166 సంపుటము : 29 పుట: 111 రాగం : ఆహిరి

51 ఇదిగో యలమేల్మంగ యింత బత్తి నీమీఁద
పొదిగొన్న నీకు వలపులు గుమ్మరించీని ॥పల్లవి॥

పడఁతి నీ గుణాలకు పలుమారు మెచ్చిమెచ్చి
వుడివోని సంతోసాన నోలలాడీని
కడు నీ చక్కఁదనాలు కాంతలతోఁ జెప్పి చెప్పి
వెడఁగుఁ బులకలతో విఱ్ఱవీఁగీని ॥ఇదిగో॥

నేరుపుల మీచేఁతలు నెమ్మదిఁ జూచి చూచి
కోరికలు కొనసాగ గుబ్బతిలీని
కూరిమితోడుత నీ కొలువులు సేసి చేసి
చేరి నీతో వేడుకలఁ జెలరేఁగీని ॥ఇదిగో॥

సేసవెట్టీ నీపై నిదె సెలవుల నవ్వి నవ్వి
ఆసలఁ గాఁగిట నిన్ను నప్పళించీని
రాసికెక్కి నీవేలఁగా రతుల శ్రీ వేంకటేశ
పోసరించి యన్నిటాను భోగించీని ॥ఇదిగో॥

**భావ పరిమళం :**

అన్నమయ్య, స్వామి వారి చెలికత్తెవలె ఆయన దేవేరికి ఆయనపైగల ఆరాధన, వలపులను వివరిస్తున్నారు. స్వామివారి రతులలో భోగించినదని చెబుతున్నారు. ప్రభూ! ఇదిగో నీమీద యెంతో ఆరాధన గల అలమేల్మంగ, నీపై ఆవరించిన వలపులను కుమ్మరించినదయ్యా! ఆ పడతి మనోజ్ఞమైన నీ సుగుణములను మెచ్చి మెచ్చి తరగని సంతోషముల నోలలాడినదయ్యా! నీ చక్కదనమును తన చెలులతో చెప్పి చెప్పి మితిమీరిన పులకరింతలతో విఱ్ఱవీగినదయ్యా! ప్రభూ! నీ చేతల నేర్పును, నెమ్మదితనము చూచి చూచీ ఆమెకు నీపై మక్కువ యెక్కువైనదయ్యా! అనురాగముతో నీ కొలువునకు విచ్చేసి విచ్చేసి నీతో వేడుకలు పంచుకొని చెలరేగినదయ్యా! ప్రభూ! నీపై మంగళాక్షతలు చల్లి, ఆపైన మనోహరమైన తన చిరునవ్వులు చిలికించి చిలికించీ ఆశలు పురివిప్పిన తన పరిష్వంగము నిన్ను అప్పళించినదయ్యా! గణనకెక్కిన నీ సురతముల గర్వించి, ఓ శ్రీవేంకటేశ్వరా! ఆ దేవి అన్ని విధములా భోగించినదయ్యా!

★ **గుబ్బతిల్లు** – అతిశయించు ★ **సేసవెట్టు** – అక్షతలు చల్లు

★ **అప్పళించి** – కప్పివేసినది ★ **పోసరించి** – గర్వించి





సంఖ్య : 164 సంపుటము : 29 పుట: 110 రాగం : మాళవిగౌళ

52 ఇన్నాళ్ళు నెఱఁగము నిటువంటివి
సన్న నిట్టె జరగునో సారె మీ ఇద్దరికి ॥పల్లవి॥

పొలసి పొలసి యేమీ (మి?) పొదిగీని యాపె నిన్ను
పిలిపించితివో నీవు ప్రియముతోడ
మొలక నవ్వులతో నీమొగము దప్పకచూచి
కలవో వొడఁబాట్లు కడు మీ యిద్దరికి ॥ఇన్నా॥

చేరి చేరి వూడిగాలు సేయఁగవచ్చీ నీకు
కారణమేమైనాఁ గద్దో కాఁగిటికిని
నేరుపుతో సలిగెలు నెరపీ నీముందరను
యీరీతి వేడుకాయనో యిట్టె మీ ఇద్దరికి ॥ఇన్నా॥

పెనఁగి పెనఁగి యాపె బెరసి నవ్వీ నీతో
చనవు నీ వొసఁగినచందమో యిది
యెనసితి శ్రీవేంకటేశ యింతలో నన్ను
మనసు లొక్కటాయనో మరి మీ యిద్దరికి ॥ఇన్నా॥

**భావ పరిమళం :**

అన్నమయ్య స్వామిని వలచిన వనిత, స్వామి దేవిని వదలలేదని ఈమెకూ తెలియును. అయినా స్వామి వలపునాసించి, అడపాతడపా స్వామిని పొందుతూనే వుంటుంది. ఆమె స్వామితో యేమంటున్నదో వినండి. స్వామీ! నీవు శ్రీదేవి సొత్తువని, నాకు తెలియును. మీ ఇద్దరికీ కూడా మధ్యమధ్య ఇటువంటివి జరగుతాయా!! కమ్ముకొనినట్లు ఆమె యేమి అతిశయము జూపుచున్నది. మరి తప్పేదేమున్నది, నీవే ఆమెను పిలువనంపితివి. చిరునవ్వులతో ఆమె నీమోము చూచిందంటే ఇక మీ ఇద్దరికీ వొడంబడికలు తప్పనే తప్పవు. ప్రభూ! ఆమె (దేవి) నీకు చేరికయై సేవలు చేయగల నేర్పరి. సేవా కార్యక్రమంలో ఈ కౌగిలింతల వ్యవహారం యేమిటి స్వామీ! ఆమె నీముందరే చాకచక్యంతో అతి చనువు ప్రదర్శిస్తుంది. మీ ఇద్దరికీ ఇట్లాంటి చిలిపి పనులు వేడుకాయెనా యేమి? ప్రభూ! ఆమె (దేవి) నీకు చేరికయై పెనవేసీ పెనవేసీ మనోజ్ఞముగా నవ్వుతుంది. ఇదంతా నీవిచ్చిన చనవే కదయ్యా! మీ సంగతి ఇట్లా వుండగానే వో శ్రీవేంకటేశ్వరా! నన్నూ (అన్నమయ్యనూ) కూడితివి. మన మనస్సులు వొక్కటైనవి. మరి మీ ఇద్దరికీ లోటేలేదు. ఆమె నీ హృదయవాసినియే.

★ **పొదిగీని** – అతిశయించెను ★ **బెరసి** – చేరికయై

★ **సలిగెలు** – అతిచనవు ★ **వూడిగాలు** – సేవలు

రచయిత:

# అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు




| | | |
|---|---|---|
| పిలవండి | : | **అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు** |
| పుట్టింది | : | **9-6-1945** |
| చదివింది | : | **ఎం.టెక్.** |
| ఉండేది | : | **ఫ్లాట్ నెం. 5., ప్లాటు నెం. 61,<br>సిద్దార్థ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్.** |
| రంథి | : | **భగవన్నామ సంకీర్తన** |
| నచ్చింది | : | **శాస్త్రీయ సంగీతం** |
| నచ్చంది | : | **నక్కజిత్తులు** |
| మెచ్చింది | : | **సజ్జన సాంగత్యం** |
| రింగండి | : | 00919393021360 |
| చదవండి | : | www.geetadeksha.com |
| ఇవ్వండి | : | e-mail : geetadeksha@gmail.com |








**గమనిక :**

నేనిదివరలో "అన్నమయ్య-అనుయాయులు", "భావయామి వేంకటేశం" లను వెలువరించినప్పుడు కొన్ని కీర్తనలు ఈ "హరిసేవకే వేంకటేశ మకుటం" అనే సంకలనములో పునఃముద్రణ జరిగివున్నవి. వీటిమధ్య ఆరు సంవత్సరముల కాలం దొర్లినందువల్ల ఆ పునాగమనం జరిగింది. క్షంతవ్యుడను. కాని, "భావపరిమళం" సంక్షిప్త తాత్పర్యం కనుక వివరణ తేడాగా వుంటుంది.

**– రచయిత**